ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఏలూరు
జిల్లా వార్తలు
మంగళవారం 20 ఫిబ్రవరి 2024

ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 36.0
కనిష్ఠం : 19.0

నేడు జిల్లాకు కేంద్ర మంత్రి
నిర్మలమ్మ రాక



నరసాపురం, ఫిబ్రవరి 19 : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళ వారం నరసాపురం మండలం పీఎం లంక గ్రామానికి విచ్చేస్తున్నారు. సుమారు తొమ్మిదేళ్ల క్రితం మంత్రి ఈ గ్రామాన్ని దత్తత తీసుకుని కోట్లాది రూపాయల అభివృద్ధి పనులను చేపట్టారు. గత ఏడాది అక్టోబరులో కూడా గ్రామానికి విచ్చేశారు. ఆ సమయంలో కోతకు గురవుతున్న సముద్ర గట్టును పరిశీలించారు. అడ్డుకట్టకు గోడలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రముఖ కార్పొరేట్ సంస్థ డెల్ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా రూ.15 కోట్లు వెచ్చించి, వాల్ నిర్మాణానికి ముందుకు వచ్చింది. చెన్నై ఐఐటీ నిపుణులు సర్వే చేసి ఒక నివేదికను అందించారు. దీని కనుగుణంగా నిర్మాణ పనులు జరగనున్నాయి. ఇటీవల కలెక్టర్ పి.ప్రశాంతి పనులకు ఆమోదం తెలిపారు. ఈ విషయాన్ని మంత్రి నేడు పీఎం లంకలో అధికారికంగా ప్రకటన చేసే అవకాశం ఉంది. మరోవైపు గ్రామంలోని డిజిటల్ భవనంలో విశ్వకర్మ యోజన పథకం కింద 1,100 మంది స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ పొందారు. వీరందరికి మంత్రి సర్టిఫికేట్‌లతో పాటు రూ.15,000 విలువ చేసే కిట్లును అందించనున్నారు. ఆమె వెంట రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పాల్గొననున్నారు.

టూర్ షెడ్యూలు

- విజయవాడ నుంచి కారులో మధ్యాహ్నం 12 గంటలకు పెనుగొండ చేరుకుంటారు.
- 12 నుంచి 12.45 గంటల వరకు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం సందర్శన.
- మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు నరసాపురం మున్సిపల్ అతిథి గృహంలో బస.
- 3 నుంచి 3-45 గం.ల వరకు పీఎం లంక డిజిటల్ కమ్యూనిటీ సెంటర్ సందర్శన.
- సాయంత్రం 4 గంటలకు పెదమైనవాని లంక నుంచి విజయవాడకు పయనం.

పవన్‌కల్యాణ్ రేపు భీమవరం రాక



భీమవరం, ఫిబ్రవరి 19 : జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఈ నెల 21న భీమవరం పర్యటనకు రానున్నారు. నిజానికి ఈ నెల 20న జరగాల్సిన పర్యటన ఒక రోజు వాయిదా పడినట్లు ఆ పార్టీ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమల్ల చంద్రశేఖర్ తెలిపారు. భీమవరం జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 21న జనసేన-తెలుగుదేశం ముఖ్య నాయకులతో ఆయన భేటీ అవుతారని తెలిపారు. కొంత మంది పవన్ లోకల్ కాదు నాన్ లోకల్ అని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఓడిపోయే వాళ్లు ఎన్ని విమర్శలు చేసినా పట్టించుకోనవసరం లేదన్నారు. ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జ్ జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ ఎవరు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ఆయన భీమవరం రాకుండా ఆపలేరని వ్యాఖ్యానించారు. బండి రమేష్‌కుమార్, మోకా శ్రీనివాస్, గిరి, దారపురెడ్డి త్రివిక్రమ్, నాగిడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈ పక్షులకు ఏమైంది ?

- ఏలూరు ప్రభుత్వాస్పత్రి ఆవరణలో మృత్యువాత



ఏలూరు క్రైం, ఫిబ్రవరి 19 : ఏలూరు ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని చెట్లపై నివాసం ఉండే పక్షులు కొద్ది రోజుల నుంచి తెల్లవారేటప్పటికి మృతి చెంది కిందపడి కనిపిస్తున్నాయి. రేడియేషన్ ప్రభావమే దీనికి కారణమన్న అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్ల క్రితం వరకు ఆస్పత్రి ఆవరణ నిండా కాకులు కనిపించేవి. రోగులు, రోగి బంధువులు పడవేసే విస్తరాకుల్లోని ఆహార పదార్థాలను తినేవి. క్రమేణ వాటి ఉనికి కన్పించకుండా పోయిం ది. నగరంలోని పురాతన భవనాలపై, పెద్ద పెద్ద భవనా లపై ఉండే పావురాలు కొంతకాలం నుంచి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఉన్న భవనాల కిటికీలను తమ ఆవాసాలుగా మార్చుకున్నాయి. మరికొన్ని పక్షులు ఆస్పత్రి ఆవరణలోని చెట్లపై తమ ఆవాసాలను నిర్మించుకున్నాయి. ఇటీవల ఏమైందో ఏమో కాని తెల్లవారేటప్ప టికి ఆస్పత్రి ఆవరణలో రకరకాల పక్షులు మృతి చెంది కనిపిస్తున్నాయి. ప్రతిరోజూ ఒకటో రెండు పక్షులు, పావురాలు మృతి చెంది కనిపిస్తున్నాయి. ఓ పక్షి పోలీస్ ఔట్‌పోస్టు వద్ద కొట్టుకుంటుండగా పోలీస్ సిబ్బంది మంచినీళ్లు పట్టించి చెట్టుపై ఉంచారు. అయినా ఆ పక్షి కోలుకోలేక మృత్యువాత పడింది. ఎంసీహెచ్ భవనం వద్ద మరో పావురం మృత్యువాత పడింది. నగరంలో విచ్చలవిడిగా సెల్‌ఫోన్ టవర్లను ఏర్పాటు చేయడం వల్ల రేడియేషన్ విపరీతంగా పెరిగి దాని ప్రభావం వల్లే పక్షులు మృత్యువాత పడుతున్నాయన్న అనుమానాలను పక్షుల ప్రేమికులు వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో రేడియేషన్ ఎక్కువగా ఉందో లేదో అధికారులు తేల్చాల్సి ఉంది. అసలు పక్షులు ఎందుకు మరణిస్తున్నాయన్న దానిపై అధికారులు విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పలువురు కోరుతున్నారు.

నేడు పట్టిసీమ వీరేశ్వరస్వామి కల్యాణం

పోలవరం, ఫిబ్రవరి 19 : పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఈనెల 20 తేదీ నుంచి 25 తేదీ వరకు జరుగుతాయని ఈవో ఎస్.సంగమేశ్వరశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 తేదీ ఉదయం 7.30 గంటల నుంచి 8.30 గంటల వరకు సుప్రభాత సేవ, అభిషేకాలు, కుంకుమ పూజలు, లక్ష పత్రి పూజ, కుంకుమార్చన, సాయంత్రం అంకురార్పణ, ధ్వజారోహణం, రాత్రి 8 గంటలకు శివకల్యాణ రాయబారం, 9.45 గంటలకు స్వామి కల్యాణోత్సవం, 21వ తేదీ ఊరేగింపు సేవ, 22న గ్రామంలో పల్లకీ సేవ, 23 ఉదయం 6 గంటల నుంచి రుద్రాభిషేకం, కుంకుమార్చన, 24న పూర్ణాహుతి, త్రిశూల స్నానం, నాగవల్లి వసంతోత్సవం, రాత్రి 7 గంటలకు గోదావరి నదిలో తెప్పోత్సవం, 25న రాత్రి 8 గంటలకు శ్రీపుష్పయాగం, పవళింపు సేవ జరుగుతాయి.

వైసీపీ అరాచక పాలన

7

ఏలూరులో..



ఏఎస్పీ స్వరూపరాణికి వినతి పత్రం అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

భీమవరంలో..



ఆర్డీవో శ్రీనివాసులురాజుకు వినతి పత్రం అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకల దాడికి జర్నలిస్టు సంఘాల ఖండన

ఉమ్మడి పశ్చిమలో నిరసనలు

నిందితులపై చర్యలు కోరుతూ వినతిపత్రాలు..

అటూ.. ఇటూ!

కమలంలో పైపైకి కదనోత్సాహం.. లోలోన అంతటా గందరగోళం.. అత్యధికులు ఏదో ఒక పార్టీతో పొత్తు పెట్టుకుని రంగంలోకి దిగితే భేషుగ్గా ఉంటుందని ఆరాటం. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశంతో కలిసి అడుగులు వేసేందుకు రంగం సిద్ధమైందన్న ప్రచారం సాగి పక్షం రోజులు గడుస్తున్నా స్పష్టత లేకపోవడంతో ఇప్పుడు కమల నాథులంతా దిక్కులు చూస్తున్నారు. పొత్తు ఉన్నా లేకపోయినా అన్ని అసెంబ్లీ స్థానాల్లో, లోక్‌సభ నియోజక వర్గాల్లో పోటీకి వీలుగా ఇప్పటికే ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వీటన్నింటినీ ఎప్పటి లోపు వడపోస్తారనే ప్రశ్న ఉత్పన్నమైతే మళ్లీ అది పొత్తు ఖరారైన తర్వాతేనని స్పష్టమైన సంకేతాలిస్తున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో ఆ పార్టీలో వ్యవహారం గజిబిజిగానే మారింది.

– ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

కమలంలో ఎడతెగని సస్పెన్స్

- ఒంటరిగానా... పొత్తో తేలక గజిబిజి
- పెద్ద సంఖ్యలో ఆశావహుల దరఖాస్తు
- వీరిలోనూ ఇదే తరహా ఒడిదుడుకులు
- ఏలూరు నుంచి చౌదరి, నరసాపురం నుంచి వర్మ
- లోక్‌సభ స్థానాల్లో ఒక్కొక్కరే ఆశావహులు



ఇంతకీ ఏం జరగబోతోంది !

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడేందుకు పట్టుమని మూడు వారాలు సమయం లేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రధాన పక్షాలన్నీ ఇప్పటికీ గందరగోళంలో వున్నాయి. రాష్ట్రంలో అధికార వైసీపీని ఆసాంతం ఢీకొని మట్టి కరిపించాలని భావిస్తున్నా, ఆ మేరకు ఆశావహులు ఖరారే పూర్తికాలేదు. భారతీయ జనతా పార్టీ నెలరోజుల క్రితమే అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. రిజర్వుడు స్థానాలైన చింతలపూడి, పోలవరం, గోపాలపురం, కొవ్వూరు వంటి నియోజక వర్గాల నుంచి ఆశించిన దానికన్నా ఎక్కువ సంఖ్యలోనే దరఖాస్తులు అందడంతో పార్టీ నేతలు నివ్వెర బోయారు. క్షేత్రస్థాయిలో పార్టీకి పెరుగుతున్న ఆదరణకు ఇదొక నిదర్శనమని ఇంకొందరు ప్రచారం చేశారు. వాస్తవానికి గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి లభించిన ఓట్లు అప్పట్లో అందరినీ పూర్తిగా నిరాశపర్చాయి. ఒకవైపు ప్రధాని మోదీ విజయాలపై పెద్ద ఎత్తున ప్రచారం చేసినా కొన్ని స్థానాల్లో జనం నుంచి ఆదరణ లభించలేదు. ఇప్పుడు తాజాగా జరగబోతున్న సార్వత్రిక ఎన్నికల్లో ఒంటరిగా కాకుండా టీడీపీతో పొత్తుకు దిగి ఆ మేరకు పూర్తిగా నిలదొక్కుకోవాలని యోచనలో పార్టీ నేతలున్నా, కేంద్ర నాయకత్వం ఇప్పటి వరకు పూర్తిస్థాయి సంకేతాలు పంపలేదు. ఇదే తరుణంలో నరసాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాస వర్మ తన సుముఖతను పార్టీకి తెలిపారు. నరసాపురం లోక్‌సభ స్థానంలో ఇంతకు ముందు రెబల్ స్టార్ కృష్ణంరాజు పోటీకి దిగడం, ఆ తదుపరి పార్టీకి కలిసొచ్చిన అవకాశం కూడా పార్టీ పెద్దలకు వర్మ వివరించినట్టు సమాచారం. ఈ నియోజక వర్గంలో పార్టీకి సంతృప్తికర స్థాయిలో అనుకూల సంకేతాలున్నాయనే విషయాన్ని విడమర్చి చెప్పారు. ఇదే లోక్‌సభ స్థానం నుం చి వైసీపీ పక్షాన బీసీ అభ్యర్థి ఉమాబాలను రంగంలోకి దింపినా... బీజేపీకి బీసీలు, ఇతర వర్గాలు నుంచి సానుకూలతే ఎక్కువగా వుందని, ఆర్‌ఎస్‌ఎస్ పెద్ద లకు వివరించినట్టు సమాచారం.

ఇంకోవైపు పొత్తు కుదిరినా కుద రకపోయినా, ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీకి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతా రామాంజనేయ చౌదరి రంగం సిద్ధం చేసుకున్నారు. ప్రత్యేకించి క్షేత్ర స్థాయిలో దూసుకు పోయేందుకు వీలుగా గ్రామీణ ఓటర్లను ఆకట్టుకునేందుకు జబర్దస్త్ టీంను రంగంలోకి దించారు. ఇది కాస్తా ఫలించి క్షేత్రస్థాయి వరకు గారపాటి చౌదరి పేరు అందరినోటా నానేందుకు దోహపడింది. గేయరచయిత అనం త శ్రీరామ్ దగ్గరుండి మరీ చౌదరి పక్షాన పరోక్ష ఎన్నికల ప్రచారం సాగిస్తున్నారు. ప్రత్యేకించి లోక్‌సభ స్థానాల విష యంలో అటు శ్రీనివాస వర్మ, ఇటు గారపాటి చౌదరి వ్యక్తి గతంగా కొంత స్పష్టతతోనే వ్యవహరి స్తున్నారు. తెలుగు దేశంతో అందరూ అనుకున్నట్లుగా పొత్తు కుదిరితే ఈ రెండు నియోజకవర్గాలలో ఏ స్థానం నుంచి పార్టీ అభ్యర్థి పోటీ చేస్తారన్నది తేటతెల్లం కానుంది. ఒకవైపు పొత్తు అనే ప్రచారం, ఇంకోవైపు చడీచప్పుడు లేకపోవడంతో బీజేపీ కేడర్‌లో కాస్తా గందరగోళం నెలకొంది.



అసెంబ్లీ స్థానాల్లో ఇంకో గందరగోళం

అసెంబ్లీ నియోజక వర్గాల్లో పోటీకి అనువుగా ముందస్తుగానే దరఖాస్తు చేసుకుంటు న్నారు. పరిశీలన జరుగుతున్న సమయంలోనే పొత్తు ప్రస్తావన రావడం, ఇంకోవైపు పార్టీ కార్యక్రమాలు ఒకదాని తర్వాత ఇంకొకటి వరుసగా వస్తుం డడంతో పార్టీ కేడర్ కాస్తంత బిజీగా మారింది. 'పల్లెకు పోదాం' పేరిట ప్రతి ఒక్కరినీ కలిసి సమస్యలు తెలుసుకుని పార్టీ అనుకూలత పెరిగేలా చేయాలని బీజేపీ తన పార్టీ కేడర్‌కు పిలుపునిచ్చింది. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీతా రామాంజనేయ చౌదరి ముంపు మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడులలో దీనికి నాంది పలికారు. ఈలోపే ప్రజాపోరు పేరిట మరో తాజా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రత్యే కించి ఇప్పటికే నియోజకవర్గ స్థాయి బాధ్యులంతా సాధ్య మైనంత మేర ప్రజాక్షేత్రంలోకి వెళ్లేందుకు వీలుగా ఎక్కడిక క్కడ ఈ కార్యక్రమాలు వినియోగిస్తూనే వున్నారు. కానీ ఎటుతిరిగి పొత్తు సస్పెన్సే పార్టీ కేడర్‌ను ముందడుగు పడనీయకుండా చేస్తోంది. ఏలూరు నియోజకవర్గం నుంచి అత్యధికంగా 10 నుంచి 20 లోపు ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు వీరిలో నాగం శివ, నడపన దాన భాస్కర రావు, సుధాకర కృష్ణ, చెన్నకేశవుల రంగారావు, శ్రీకృష్ణదేవ రాయలు, రాణి, కుసుమకుమారి తో పాటు మరికొందరు న్నారు. ఇదే క్రమంలో నరసాపురం లోక్‌సభ నియోజకవర్గం పరిధి లోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో పెద్ద సంఖ్యలోనే దరఖాస్తులందాయి. ఎటుతిరిగి ఈ రెండు లోక్‌సభ స్థానాల పరిధిలో టీడీపీ, జనసేన ఎన్నికల పొత్తులో ఎవరెవరు దాదాపు ఏ స్థానాల్లో పోటీ చేయబోతున్నారనే విషయంపై ప్రత్యక్ష, పరోక్ష పద్ధతుల్లో ఇప్పటికే ఆశావహులందరికీ సంకేతాలందాయి. సామాజిక వర్గాల వారీగా కొన్ని నియోజక వర్గాల్లో ఆయా వర్గాల వారికే ప్రాధాన్యతివ్వాల్సి ఉంది. ఈ క్రమంలో ఒకేసారి సమయం లేకుండా అభ్యర్థులను రంగంలోకి దింపితే పార్టీ ఆశించిన ఫలితాలు ఉండబోవనే చర్చ పార్టీలో సాగుతోంది.

ఆఖరికి రిజర్వుడు నియోజక వర్గా ల్లోనూ ఇదే గందరగోళం నెలకొంది. చింతలపూడి స్థానంలో పోటీ చేసేందుకు పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్, మరో సీనియర్ నేత దిడ్ల ఏంజిలోతోపాటు మరికొంద రు పోటీ పడుతున్నారు. పోలవరం ఎస్‌టి రిజర్వుడు నియో జకవర్గం నుంచి ఇలాంటి పరిస్థితే ఉంది. ఇంకో ప్రత్యేకత ఏమంటే ఈ రెండు రిజర్వుడు స్థానాల్లో పోటీ చేసేందుకు అనువుగా దరఖాస్తు చేసే వారంతా 50 ఏళ్లకు లోబడి వున్నవారే కావడం, దీనికంటే మించి ఉన్నత విద్యార్హత ఉండడం ఇంకో విశేషంగా భావిస్తున్నారు.

ఢిల్లీలో నో కామెంట్స్

రెండురోజుల పాటు ఢిల్లీలో జరిగిన బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో ఏపీలో పొత్తు అంశంపై అగ్రనేతలు ఎవరూ చూచాయగా సంకేతాలు ఇవ్వకపోవడం క్షేత్ర స్థాయిలో ఆ పార్టీని మరింత గందరగోళంలోకి నెట్టింది. ఈ అంశంపై పార్టీ పెద్దలతో ఉమ్మడి పశ్చిమ నుంచి వెళ్లిన కొందరు పార్టీ ప్రతినిధులు వారితో సంభాషించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదని చెబుతున్నారు. రాష్ట్ర నాయకత్వం సైతం ఈ తరహా సంకేతాల కోసం ఎదురు చూస్తోందని, అప్పటివరకు ఈ సస్పెన్స్ తప్పదని భావిస్తోంది.

రంగులు మారుతున్న నూజివీడు రాజకీయం

వైసీపీ వైపు ముద్దరబోయిన అడుగులు !



నూజివీడు, ఫిబ్రవరి 19 : నూజివీడు తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ అభ్యర్థి మార్పుతో ఏలూరు, ఉమ్మడి కృష్ణా జిల్లాల్లో అనూహ్య మార్పులు జరగనున్నాయా ? నూజివీడు అసెంబ్లీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ముద్దరబోయినకు బదులు పెనమలూరు వైసీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొలుసు పార్థసారధికి కేటాయించనున్నట్టు పార్టీ నిర్ణయించింది. ఈ నెల 26న టీడీపీలో చేరనున్న పార్థసారధి నాలుగు రోజులుగా నియోజకవర్గంలో పర్యటిస్తూ టీడీపీ కార్యకర్తలు, నాయకులను కలుస్తూ సహకారం కోరుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం ముద్దరబోయిన సీఎం జగన్ పేషీలో వైసీపీ నాయకులతో సమాలోచనలు జరిపినట్లు వార్తలు రావడంతో సంచలనం కలిగింది. ముద్దరబోయిన వెనుక వున్న బీసీ కార్డును ఉపయోగించుకోవడానికి వైసీపీ, ఎత్తుగడలకు తెరతీసింది. ముద్దరబోయినను కృష్ణాలోని గన్నవరం, మైలవరం, ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గాల్లో ఏదో ఒకచోట నుంచి పోటీకి దింపే యోచనలో వైసీపీ ఉన్నట్టు సమాచారం. సోమవారం జరిగిన సమాలోచనలో వైసీపీకి ముద్దరబోయినకు మధ్య ఇంకా సంధి కుదిరినట్లు లేదు ! ముద్దరబోయినకు నూజివీడు వైసీపీ అసెంబ్లీ టిక్కెట్ ఇచ్చి, సిట్టింగ్ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్‌అప్పారావుకు కాని, ఆయన కుమారుడు వేణుగోపాల అప్పారావుకు కాని ఏలూరు వైసీపీ ఎంపీ టిక్కెట్ కేటాయిస్తే ఎలా ఉంటుందనే సమాలోచనలు వైసీపీలో సాగుతున్నట్లు జరుగుతోంది. సోమవారం సాయంత్రం సీఎం జగన్ పేషీ నుంచి నూజివీడు సిట్టింగ్ ఎమ్మెల్యే మేకా ప్రతాప్, ఆయన కుమారుడు వేణుగోపాల్‌కు పిలుపు రావడంతో, వీరిద్దరూ పార్టీ పెద్దలను కలిసినట్లు సమాచారం.

తుది నిర్ణయం తీసుకోలేదు : ముద్దరబోయిన

'నూజివీడులో పదేళ్ళుగా టీడీపీ జెండా మోసా. పార్టీ కార్యక్రమాలు అన్ని తూ.చా. తప్పకుండా పాటించా. నియోజకవర్గంలో పరిస్థితి నాకు అనుకూలంగా ఉన్నా మరో వ్యక్తికి టిక్కెట్ కేటాయిస్తున్నట్లు ప్రచారం జరగటంతో మనస్థాపం కలిగించింది. గత శనివారం నూజివీడులో నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశమై నా రాజకీయ భవిష్యత్తును మీరే నిర్ణయించి రెండు, మూడు రోజుల్లో తెలపాలని కార్యకర్తలను కోరా. వారి అభిప్రాయాలు చెప్పిన తరువాత నేను తుది నిర్ణయం తీసుకుంటా'నని ముద్దరబోయిన ఆంధ్రజ్యోతికి తెలిపారు.

కలుషిత ఆహారం తిని..

36 మంది విద్యార్థులకు అస్వస్థత.. ఇద్దరికి తీవ్రంగా..

- జీలుగుమిల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ఘటన
- అధికారుల సందర్శన.. వైద్య శిబిరం ఏర్పాటు

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 19 : జీలుగుమిల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం తిని 36 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలకు చెందిన 40 మంది విద్యార్థులు ఆదివారం రాత్రి చికెన్, ఇతర ఆహార పదార్థాలను భుజించారు. అయితే సోమవారం వీరిలో 36 మందికి వాంతులు, విరోచనాలయ్యాయి. సమాచారం అందుకున్న స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి గాయిత్రి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది అక్కడకు చేరుకుని ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్య సేవలందించారు. తీవ్ర అస్వస్థతకు గురైన కె.గౌతమ్ (7తరగతి), ఎం.హరికృష్ణ (9వతరగతి)లకు ఉన్నత వైద్యం నిమిత్తం తహసీల్దారు ఆర్.వి.వెంకటేశ్వరావు కారులో జంగా రెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించారు. మరో ఆరుగురు విద్యార్థులను జీలుగు మిల్లి పీహెచ్‌సీలో సోమవారం రాత్రి వరకు వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. విషయం తెలుసుకున్న ఐటీడీఏ డీడీ ఎంవీఎస్.నాయుడు, ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో కేథరిన్, తహసీల్దారు, ఎంపీడీవో కేఎం.మంగతాయారు పాఠ శాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశా రు. ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టరు నాయుడు హెచ్‌ఎం.రాజు సైతం పాఠశాలకు విచ్చేసి వార్డెన్ నవీన్, ఏటీడబ్ల్యూవో మోహన్‌కృష్ణల నుంచి వివరాలు సేకరించారు. మొత్తం ఆశ్రమ పాఠశాలలో 320 మంది విద్యార్థులుండగా ముగ్గురు మాత్ర మే వంట పనివారు ఉండడం, విద్యార్థులపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వంటి విషయాలపై సిబ్బందిని ప్రశ్నించారు. నివేదికను కలెక్టరుకు పంపిస్తా మన్నారు. ఆదివారం పాఠశాలలో వండిన చికెన్, ఇతర ఆహార పదార్థాలు కలుషితమై ఫుడ్ పాయిజన్ అయ్యి ఉండవచ్చని వైద్యశాఖ అధికారులు భావి స్తున్నారు. కాగా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై టీడీపీ శ్రేణు లు ఆరా తీశాయి. టీఎన్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. వైద్యురాలు గాయి త్రి, విద్యార్థులతో మాట్లాడారు. అత్యవసరమైతే విద్యార్థులకు తగిన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు సుంక వల్లి సాయి, టీఎన్‌ఎస్‌ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు బొలగాని అఖిల్, నాలి శ్రీను, బి.రాజబాబు, సీహెచ్.రవి, జి.శ్రీను, చింటు, సాయిరాం ఉన్నారు.



జీలుగుమిల్లి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థులు





అస్వస్థతకు గురైన విద్యార్థులను కారులో ఆస్పత్రికి తరలింపు.. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న ఐటీడీఏ డీడీ, తహసీల్దారు, ఎంపీడీవో

పకడ్బందీగా పది పరీక్షలు : కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 19 : జిల్లాలో మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు జరిగే పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఆదేశించారు. పది పరీక్షల నిర్వహణపై సోమవారం ఆయా శాఖల అధికారులతో నిర్వహించిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ.. 'ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ జరగకుండా చర్యలు తీసుకోవాలి. గతేడాది అనుభవాల దృష్ట్యా చీఫ్ సూపరింటెండెంట్ తప్ప విద్యార్థులతో పాటు టీచర్లు సెల్‌ఫోన్‌లు తీసుకు రాకూడదు. జిల్లాలో 139 పరీక్షా కేంద్రాలను ముందుగానే తనిఖీ చేయాలి. ప్రతిపరీక్షా కేంద్రం వద్ద వైద్యశిబిరం ఏర్పాటుచేసి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అత్యవసర మందులతో వైద్యశాఖ అందుబాటులో ఉండాలి. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, కెమెరాలు, ఇయర్ ఫోన్‌లు, స్మార్ట్‌వాచ్, బ్లూటూత్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించబడవు'.. అని పేర్కొన్నారు. డీఈవో అబ్రహం మాట్లాడుతూ మొత్తం 32,355 మంది పరీక్షలకు హాజరు కానున్నారని, వీరిలో 16,760 బాలురు, 15,595 మంది బాలికలు ఉన్నారని, రెగ్యులర్ విద్యార్థులు 24,125 కాగా ప్రైవేట్ విద్యార్థులు 8,230 మంది ఉన్నట్టు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. సమావేశంలో ఆర్డీవో ఎన్.ఎస్.కె ఖాజావలీ, ఏఎస్పీ స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ గోదావరి జిల్లాలో..

భీమవరం ఫిబ్రవరి 19 : రాప్తాడులో జరిగిన వైసీపీ సిద్ధం బహిరంగ సభలో విధి నిర్వహణలో ఉన్న ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు చేసిన దాడిని ఖండిస్తూ భీమవరం కలెక్టరేట్ వద్ద ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. భీమవరం ఏరియా ప్రెస్‌క్లబ్ సభ్యులు కలెక్టరేట్ స్పందనలో భీమవరం ఆర్డీవో శ్రీనివాసులురాజుకు వినతి పత్రం అందజేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కేవీ ప్రసాద్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమోహన్ మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛకు ఆటంకం కల్పించిన వారిపై కఠిన చర్యలు తీసుకుని వెంటనే అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు సాయిబాబ, ఎలక్ట్రానిక్ విభాగం జిల్లా కోశాధికారి వర్మ, జిల్లా ఉపాధ్యక్షుడు గోపాలకృష్ణ, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు నూకల సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి బొక్కా నాని, పట్టణ ప్రెస్‌క్లబ్ పట్టణ కోశాధికారి భరత్ శీను, ఉపాధ్యక్షుడు ఆది, కృష్ణ, జి.వెంకటేష్, కే.మాణిక్య తేజ రావు, బీసీఎస్ పండు, ఆదిత్య బాబి, జయకుమార్, సంపత్ కుమార్ పాల్గొన్నారు.

ఉండి : దాడి చేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని ఎమ్మెల్యే రామరాజు, మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు, జనసేన ఇన్‌చార్జి జుత్తుగ నాగరాజులు డిమాండ్ చేశారు. సోమవారం ఉండి ప్రధాన సెంటర్‌లో ప్రెస్‌క్లబ్, ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనకు వారు మద్దతు తెలిపారు. ప్రెస్‌క్లబ్ సభ్యులు తహసీల్దారు కార్యలయానికి వెళ్లి వినతిపత్రం అందించారు. టీడీపీ నాయకులు మోపిదేవి శ్రీను, చెన్నంశెట్టి బాబి, జనసేన నాయకులు మోపిదేవి హరి, రమేష్, ప్రసాదు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణ మోహన్, ప్రెస్‌క్లబ్ సెక్రటరీ ఈతకోట రాజు, ఉపాధ్యక్షుడు మణికంఠ, కోశాధికారి జామి అంజిబాబు, సభ్యులు గజ్జెల కేశవ, బొండాడ సత్యనారాయణ, సురేష్, కైలే రాజు,తాడి వెంకటరమణ, నరేంద్ర పాల్గొన్నారు.

ఆకివీడు: ప్రభుత్వం ప్రజలకు వారధిగా పనిచేసే జర్నలిస్టులపై దాడులను ఉండి నియోజకవర్గ ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు ఖండిస్తూ సోమవారం తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు ఎం.విఠల్, బి.కోటేశ్వరరావు, యు.ప్రసాద్, జె.ఉదయ్, ఎ.శ్రీను, ఆదిశేషు, కె.శేఖర్, బి.నాగేంద్ర, భీమేశ్వరరావు పాల్గొన్నారు.

గణపవరం : వైసీపీ శ్రేణుల దాడి ఆటవిక చర్య అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతపాటి హరికుమార్‌రాజు విమర్శించారు. సీఎం జగన్ పథకం ప్రకారం మీడియాపై రెచ్చగొట్టే ప్రసంగాల ఫలితమే ఇటువంటి దాడులకి దారి తీస్తోందన్నారు. దాడికి బాధ్యులను అరెస్టు చేసి పత్రికా స్వేచ్ఛను కాపాడాలని డిమాండ్ చేశారు.

నరసాపురం: రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ రౌడి మూకల దాడి అనుమాషం, దుర్మార్గమని మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ రాజ్యలక్ష్మి మండిపడ్డారు. జగన్ పాలనలో మీడియాకు కూడా స్వేచ్ఛ లేకుండా పోయిందన్నారు. ప్రజాస్వామ్యానికి మూలస్థంభమైన మీడియాపై వైసీపీ ప్రభుత్వం కక్షకట్టడం దారుణమన్నారు.



చింతలపూడి ఎస్‌ఐకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు



ఆకివీడులో తహసీల్దార్‌కి వినతిపత్రం అందచేసిన ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు



పోలవరంలో డీటీకి వినతిపత్రం అందిస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

దాడి అమానుషం

అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టుపై వైసీపీ నాయకుల మూకుమ్మడి దాడి అప్రజాస్వామ్యం, అమానుషమని వివిధ జర్నలిస్టు సంఘాలు, రాజకీయ పార్టీలు తీవ్రంగా ఖండించాయి. దాడికి నిరసనగా సోమవారం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళన నిర్వహించి వినతిపత్రాలు అందజేశారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడికి నిరసనగా ఆందోళనలు





తణుకు: వైసీపీ మూకలు దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి అన్నారు.గుర్తింపు కార్డులు అడిగి మరీ దాడి చేయడం వైసీపీ మూకల బరితెగింపునకు నిదర్శనమన్నారు. దాడికి పాల్పడిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఏలూరు జిల్లాలో..

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 19 : దాడికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలంటూ ఏపీయూడబ్ల్యూజే ఏలూరు జిల్లా శాఖ జర్నలిస్టులు సోమవారం ఉదయం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్పీ జి.స్వరూపరాణికి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టు నాయకులు మాట్లాడుతూ వైసీపీ దాడి అత్యంత హేయమైన చర్య అని అన్నారు. ఇటీవల ఏలూరు జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలుచోట్ల జర్నలిస్టుపై భౌతికదాడులు పెరిగిపోతున్నాయని సమాజ శ్రేయస్సు కోసం నిత్యం శ్రమించే జర్నలిస్టులపై దాడి చేసిన వారిని తక్షణం అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కోరారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మాణిక్యరావు, రాష్ట్ర కార్యదర్శి రఘురామ్, ఆంధ్రజ్యోతి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కోఆర్డినేటర్ జీవీఎస్ఎన్ రాజు, ఏపీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు సంజయ్‌కుమార్, కార్యదర్శి వాసు, చిన్నపత్రికల అధ్యక్షుడు శాంతికుమార్, చిన్న పత్రికల రాష్ట్ర కార్యదర్శి రామారావు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు ఉర్ల శ్రీనివాస్, కిషోర్, జర్నలిస్టులు గంగరాజు, భరత్, ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ ప్రసాద్, క్రైం రిపోర్టర్ బెనర్జీ పలువురు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : పట్టణ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. జర్నలిస్టులపై దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ, కౌన్సిలర్ నంబూరి రామచంద్రరావు. సీనియర్ టీడీపీ నాయకులు రాజన్న పండు, బొబ్బరా రాజ్ పాల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్, బీజేపీ, ఐజెయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు వాసా సత్యనారాయణ తదితరులు జర్నలిస్టులపై దాడులను ఖండించారు. మీడియాపై దాడి ప్రజాస్వామ్యంపై దాడి అని ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్‌చంద్రశేషు, యువ నాయకుడు బొమ్మాజీ అనిల్ అన్నారు. శ్రీనివాసపురంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు పొల్నాటి సత్యనారాయణ ఇంటి వద్ద విలేకరులతో మాట్లాడారు.సత్తా నాగేంద్ర, ఎలికే ప్రసాద్, తడికల దావీదు, రాగాని శ్రీనివాస్, తడికల మోహన్, రాగాని శ్రీను, తాళ్లూరి వెంకటేశ్వరరావు, దంసెల్లి ఆంజనేయులు, కేదాసు అర్జునరావు, వీరమళ్ల పోసిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పోలవరం : పోలవరం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో దాడికి నిరసనగా పోలవరం సెంటర్ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకూ బైకులపై ర్యాలీ నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దారు ప్రసాద్‌కి వినతిపత్రం అందజేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సొబ్బన మోహన్ మాట్లాడుతూ జర్నలిస్టులకు భద్రత కల్పించే విధంగా చట్టాలు రూపొందించాలన్నారు. పోలవరం ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

చింతలపూడి : దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీయూడబ్ల్యూజే, ఏపీయూడబ్ల్యూజే-ఎఫ్ సభ్యులు చింతలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ కుటుంబరావుకు వినతిపత్రం అందచేశారు. సంఘ నాయకులు ఎస్.కె.ఆజాద్, నాగ చెన్నారావు మాట్లాడుతూ సమాజంలో మంచిని కోరే జర్నలిస్టులపై ఇటువంటి దాడులు చేయడం అమానుషమన్నారు.సభ్యులు ముక్తేశ్వరరావు, రవి, మూర్తి, రామకృష్ణ, చిన్ని, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాటాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి : సిద్ధం సభలో జరిగిన వాస్తవాలు బయటకు రాకుండా నిరోధించాలనే ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై వైసీపీ మూకలు మూకుమ్మడి దాడికి తెగబడ్డాయని దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఫిబ్రవరి మూడున దెందులూరులో జరిగిన సిద్ధం సభలో మీడియా ప్రతినిధులపై దాడులకు పాల్పడ్డారని, ఆ సంఘటన మరువకముందే రాప్తాడులో జగన్‌రెడ్డి సిద్ధం సభలోనే అదే సీను రిపీట్ అయ్యిందన్నారు. సీఎం సభ ఎక్కడ జరిగినా మీడియా ప్రతి నిధులపై దాడులు సర్వ సాధారమయ్యాయన్నారు.





ఉండి ప్రధాన సెంటర్‌లో ధర్నా చేసిన విలేకరులకు మద్దతుగా నిలిచి మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే శివరామరాజు... శ్రీనివాసపురంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దాసరి శేషు, బొమ్మాజి అనిల్ తదితరులు

నరసాపురంలో తిరునాళ్ల సందడి

అంతర్వేదికి భారీగా తరలివెళ్లిన భక్తులు



నరసాపురం, ఫిబ్రవరి 19: అంతర్వేది తిరునాళ్ళకు సోమవారం నరసాపురం మీదుగా యాత్రికులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. స్వామి వారి కళ్యాణాన్ని తిలకించేందుకు ఉదయం నుంచి భక్తులు పోటెత్తారు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి రైళ్లల్లో తరలివచ్చిన యాత్రి కులంతా గోదావరి దాటి వెళ్లేందుకు మక్కువ చూపారు. దీంతో రేవులో భక్తుల సందడి కనిపించింది. తొక్కిసలాట జరగకుండా వచ్చి యాత్రీకుల్ని క్యూలైన్‌లో ఉంచి పంటుల్లో ఎక్కించారు. పోలీస్ , రెవెన్యూ సిబ్బంది రేవుల్లో ఉండి నిర్దేశించిన సంఖ్యలోనే పంటుల పైకి యాత్రికుల్ని ఎక్కించారు. రాత్రి వరకు రద్దీ కొనసాగింది. యాత్రికుల రద్దీ దృష్ట్యా ఈనెల 25 వరకు నాలుగు చక్రల వాహనాలకు అనుమతి నిలిపివేస్తున్నట్లు ఎంపీడీవో రమణరావు తెలిపారు. కార్లు, లారీలు, వ్యాన్లు పంటుపై ఎక్కించి రేవు దాటించవద్దన్నారు. చించినాడ మీదుగా వెళ్లాలని కోరారు. నిబంధనలను అతిక్రమిస్తే పాటదారుడిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




వివిధ రాష్ట్రాల నుంచి తీసుకువచ్చిన వాసవీ మాత ఉత్సవ విగ్రహాలు

పెనుగొండ వాసవీధాంలో వార్షికోత్సవాలు

పెనుగొండ, ఫిబ్రవరి 18: అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్టు ఆధ్వర్యంలో పెనుగొండ క్షేత్రంలో పంచమ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కర్ణాటక, తమిళనాడు, కేరళ,ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలోంల 75 ఆలయాల్లో పూజలందకుంటున్న వాసవీ మాత ఉత్సవ విగ్రహాలు తీసుకువచ్చి వాసవీ భక్తులకు దర్శనం ఇచ్చారు. తెల్లవారుజామునే వాసవీ శాంతి ధామ్‌లోని పుష్కరిణి వద్ద జలాభిషేకం చేసి రుషి గోత్ర సువర్ణ మందిరంలో తీర్చి దిద్దిన ఉపాలయాల్లో వాసవీమాత ఉత్సవ విగ్రహాలు తీసుకువచ్చి అలంకరించారు. తెనాలికి చెందిన ప్రజ్ఞానంద సరస్వతి (బాల స్వామి) స్టాల్స్‌ను ప్రారంభించారు. టస్టు అధ్యక్షుడు గోవిందరాజులు మాట్లాడుతూ వాసవీ జన్మస్థానమైన పెనుగొండ క్షేత్రాన్ని అత్యంత శక్తివంతమైన పట్టణంగా తీర్చిదిద్దడానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలన్నారు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం వాసవీ శాంతి ధామ్‌లో జరిగే కార్యక్రమాలకు హాజరు కానున్నారు. వాసవీ మాతకు నూతన సువర్ణ కిరీటం అలంకరించనున్నట్లు గోవిందరాజులు తెలిపారు.ట్రస్టు ప్రధాన కార్యదర్శి కృష్ణ, కార్యదర్శి సతీష్, కోశాధికారి శ్రీనివాసమూర్తి, సభ్యులు పాల్గొన్నారు.

పోలవరం ఏజన్సీలో పులి సంచారం

బెంబేలెత్తుతున్న గిరిజన గ్రామాల ప్రజలు



పులి పాదముద్రలు

పోలవరం, ఫిబ్రవరి 19 : పోలవరం ఏజన్సీలో పులి సంచరిస్తోందన్న సమాచారంతో ఏజన్సీ గ్రామాల ప్రజలు భయంతో బెంబేలెత్తు తున్నారు. సోమవారం పోలవరం మండలం ప్రగడపల్లి పంచాయతీ గార్యగొయ్యి గ్రామ సమీపంలో పంటపొలాల్లో పులి పాదముద్రలు గుర్తించిన రైతులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆ ప్రాంతానికి చేరుకున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాదముద్రలు పులివేనని గుర్తించి నిర్ధారించారు. ఆ ప్రాంతంలో పులి సంచరించిన ప్రాంతాలను పులి సంచారం గమనం తదితర అంశాలపై దృష్టి సారించి నిఘా ఏర్పాట్లు ముమ్మరం చేశారు. గత రెండు నెలల క్రితం పాపికొండల నేషనల్ పార్కు నుంచి ద్వారకాతిరుమల, గోపాలపురం, బుట్టాయిగూడెం మండలాల పరిధిలో సంచరించి పాడి పశువులపై దాడి చేసి చంపుకుతిన్న పులి చివరిసారిగా కన్నాపురం అడవీ రేంజ్ పరిధిలో ఆవూదూడపై దాడి చేసి చంపుకు తింది. ద్వారకాతిరుమల, కొవ్వాడ ఉడతపల్లి, కరకపాడు గ్రామాల్లో గడిచిన రెండు నెలల్లో పాడి పశువులపై, మేకలపై, ఒక అడవి పందిపై దాడి చేసింది. పాపికొండల నేషనల్ పార్కులో తగిన ఆహారం దొరకకపోవడం వలన అడవులు దాటి జనా వాస ప్రాంతాల్లోకి ప్రవేశించి పాడిపశువులపై దాడులకు పాల్పడుతోందని, అటవీశాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అటవీ క్షేత్రాధికారి దావీదురాజు మాట్లాడుతూ పులి సంచరించిన పంటపొలాలు అటవీ ప్రాంతానికి చేరువగా ఉండడం వలన వచ్చి ఉంటుందని మళ్ళీ పాపికొండల అడవుల్లోకి వెళ్ళిపోయే అవకాశాలున్నాయని అంతవరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

కల్యాణం..కమనీయం

వైభవంగా అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

అంతర్వేది, ఫిబ్రవరి 19: నవ నారసింహ క్షేత్రాల్లో అగ్రగామి అయిన అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయం కల్యాణోత్సవ శోభతో వెల్లివిరిసింది. సోమవారం దశమి రాత్రి 12:29 గంటలకు ఆరుద్ర నక్షత్రయుక్త వృశ్చికలగ్న పుష్కరాంశమందు అంరంగ వైభవంగా కల్యాణం జరిగింది. వేద మంత్రోచ్చరణలతో సకల దేవతల ఆశీర్వచనాలతో స్వామివారు ఉభయ దేవేరులైన భూదేవి, శ్రీదేవిలను కల్యాణ మాడారు.వైఖానస ఆగమానుసారం ఆలయ స్థానాచార్యులు వింజమూరి రామలింగాచార్యులు, ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, వేదపండితులు చింతా వేంకటశాస్త్రి వారి సమక్షంలో అర్చక బృందం పేరూరు ఉద్దండ పండితులు కల్యాణాన్ని నిర్వహించారు. శుభ ముహూర్తానికి జీలకర్ర, బెల్లం స్వామివారి శిరస్సుపై ఉంచారు.

ఎదురు సన్నాహంతో శ్రీకారం..

రాత్రి 10 గంటలకు ఎదురు సన్నాహంతో కల్యాణ తంతు ప్రారంభమైంది. అనాదిగా వస్తున్న సంప్రదాయం ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరుకు చెందిన ఆలయ ఫౌండర్, ఫ్యామిలీ మెంబరు రాజా కలిదిండి కుమార రామగోపాల రాజాబహదూర్ శ్రీవారి తరపున, అర్చక స్వాములు అమ్మవారి తరపున వివాహకర్తలుగా వ్యవహరించారు. ఆలయం నుంచి తొలుత స్వామివారిని తర్వాత అమ్మవార్లను పల్లకీలో వేర్వేరుగా కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. శ్రీవారు, అమ్మవార్లకు అంతర్వేదికు చెందిన డాక్టర్ పోతురాజు సూర్యవెంకట సత్యనారాయణ, కుటుంబీకులు గతంలో ఇచ్చిన ఆభరణాలను అర్చకులు అలంకరించారు. స్వామివారి తలంబ్రాలను పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పొలమూరు కుటుంబీకులు తీసుకువచ్చారు. కల్యాణోత్సవాల్లో భాగంగా అంతర్వేది పుణ్యక్షేత్రం విద్యుత్ అలంకరణల నడుమ రంగురంగులతో భక్తులకు కనువిందు చేస్తుంది. భక్తుల రద్దీ ఉన్న ప్రతి ప్రధాన కూడలిలో కల్యాణోత్సవాలను తిలకించేలా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటుచేశారు. ఉభయ రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణం తిలకించారు.



నేడు రథోత్సవం



కల్యాణోత్సవాల్లో మంగళవారం భీష్మఏకాదశి సందర్భంగా స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు శ్రీ స్వామివారి రథోత్సవం ప్రారంభం కానుంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు సోమవారం రాత్రికే రథం వద్ద అరటిపండ్లు, గుమ్మడికాయలు, ధాన్యం కుచ్చులను వాహనకారులకు ఇచ్చారు. వాటితో వాహనకారులు రథాన్ని అలంకరించారు. శ్రీ స్వామివారి రథోత్సవం రాజావారి వీధి నుంచి ఆచార సంప్రదాయాల లాంఛనాలతో సోదరి గుర్రాలక్కమ్మ అశ్వరూఢాంబిక ఆలయం వద్దకు చేరుకుని చీర, సారెలతో సోదరికి అందజేసి తిరుగు ప్రయాణంలో స్వామివారి రథం 16 స్తంభాల మండపం వద్దకు చేరుకుంటుంది.



గ్రామోత్సవంలో భక్తులు...కల్యాణం తిలకించేందుకు వచ్చిన భక్తజనం



సంఘీభావం తెలుపుతున్న ఉద్యోగ సంఘాల నాయకులు

నేడు ఉద్యోగుల జేఏసీ మహాధర్నా

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 19 : బకాయిల చెల్లింపునకు మంగళవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ఏపీజేఏసీ ఉమ్మడి జిల్లాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహా ధర్నాకు ఉద్యోగులు,ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు పెద్దసంఖ్యలో తరలిరావాలని జేఏసీ చైర్మన్ సీహెచ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సన్నాహక సమావేశం సోమవారం ఏలూరు పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘ భవనంలో జరిగింది. శ్రీనివాస్ మాట్లాడుతూ 12వ పీఆర్సీ నివేదిక అందేలోగా 30 శాతం మధ్యంతర భృతిని ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు దాచుకున్న సుమారు రూ.23,500 కోట్లను ప్రభుత్వం తన వద్ద ఉంచుకుని నేటికీ జమచేయకపోవడం వల్లే గత్యంతరంలేని పరిస్థితుల్లో ఉద్యమంలోకి వెళ్ళాల్సి వచ్చిందన్నారు. జేఏసీ నాయకులు రవికుమార్, సత్యనారాయణ, సునీత, సత్యబారతి, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

బొండాడలో కేంద్ర బృందం పర్యటన



కాళ్ళ, ఫిబ్రవరి 19 : కాళ్ళ మండలం బొండాడలో సోమవారం సాయంత్రం నేషనల్ వాష్ బృందం పర్యటించింది. గ్రామంలో జలజీవన్ మిషన్, స్వచ్ఛ భారత్‌లో జరుగుతున్న కార్య క్రమాలను పరిశీలించింది. గ్రామంలో వాటర్ శానిటేషన్ ప్రాముఖ్యతపై విలేజ్ కమిటీతో మాట్లాడారు.కేంద్ర బృందం సభ్యురాలు రామ్ సేన్ నాగి, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ ధనానంద్, ఏఈ శ్రీనివాస్, పణి, రామవేంద్ర, ఎంపీడీవో బాస్కరరావు, సర్పంచ్ మన్నే వరలక్ష్మీ, నాగలక్ష్మీ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సర్వోదయ మండలి ఆధ్వర్యంలో సేవాకార్యక్రమాలు

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 19: మహాత్మగాంధీ భార్య కస్తూరీబా గాంధీ 80వ వర్ధంతి పురస్కరించుకుని ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు వైద్య, ఇతర సేవా కార్యక్రమాలను సర్వోదయ మండలి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలలో గాంధీ ఆశ్రమాలు, అనాధ ఆశ్రమాలలో నిర్వహిస్తారన్నారు.

క్రైం కార్నర్

బయన్నగూడెంలో పెళ్ళింట్లో చోరీ

రూ.4 లక్షలు నగదు, నాలుగున్నర కాసులు బంగారం అపహరణ



పరిశీలిస్తున్న పోలీసులు

కొయ్యలగూడెం, ఫిబ్రవరి 19: పెళ్ళి జరుగుతున్న ఒక ఇంటిలో దొంగలు చొరబడి నాలుగు లక్షల నగదు, నాలుగు కాసులు బంగారం అప హరించారు. కొయ్యలగూడెం మండలంలోని బయ్యన్నగూడెం గ్రామానికి చెందిన వరదారావు ఇంటిలో ఆదివారం రాత్రి జోరీ జరిగింది. ఆయన కుమార్తె వివాహం సందర్భంగా ఇంటికి తాళాలు వేసి ఆ గ్రామంలోని కల్యాణ మండపం వద్ద పెళ్ళి పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఇది పసిగట్టిన దొంగలు అర్థరాత్రి ఇంటిలోకి చొరబడి చోరీ చేశారు. ఉదయమే పెళ్లి అవ్వగానే ఇంటికి వచ్చిన చూసే సరికి తాళాలు పగలగొట్టి ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలవరం డీఎస్పీ సురేష్ రెడ్డి, పోలవరం సీఐ మధుబాబు, ఎస్సై విష్ణువర్ధన్, సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా త్వరలోనే దొంగల్ని పట్టు కుంటామని తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత



ఉంగుటూరు, ఫిబ్రవరి 19 :జాతీయ రహదారిపై ఉంగుటూరు టోల్‌ప్లాజా వద్ద సోమవారం చేబ్రోలు పోలీ సులకు సమాచారం రావ డంతో వాహనాలను తనిఖీ చేశారు. నూజివీడు నుంచి ఉంద్రాజవరంలోని రైస్‌మిల్లుకు రేషన్ బియ్యం అనుమతి లేకుండా తీసుకువెళుతుండగా స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లై, రెవెన్యూ అధికారులు తనిఖీ చేసి 20 టన్నుల బియ్యం స్వాధీనం చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ మణి కుమార్ తెలిపారు.

నాలుగు సిలిండర్లు స్వాధీనం

భీమడోలు, ఫిబ్రవరి 19 : గృహ అవసరాలకు ఉపయోగించే సబ్సిడీ గ్యాస్ సిలెండర్లను వినియోగిస్తున్న హోటల్ యజమానిని అరెస్టు చేసి నాలుగు గ్యాస్ సిలెండర్లను స్వాధీనం చేసుకున్నట్లు భీమడోలు సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్ మాదవరావు తెలిపారు. రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కరణం కుమార్ ఆదేశాల మేరకు భీమడోలులో గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలెండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు భీమడోలు జంక్షన్‌లోని రాజుగారి బిర్యానీ హోటల్‌లో తనిఖీలు చేయగా నాలుగ సిలెండర్లను గుర్తించి హోటల్ యజమాని ఈశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విజిలెన్స్ ఎస్ఐ రంజిత్ కుమార్, వీఆర్వో సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

63 లీటర్ల మద్యం పట్టివేత



కుక్కునూరు, ఫిబ్రవరి 19 : తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి 350 మద్యం సీసాలు స్వాధీనం చేసు కున్నట్టు కుక్కునూరు సీఐ వి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం మండలంలోని ఆంధ్ర తెలంగాణ సరిహద్దుల్లోని వేలేరు చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై 350 క్వార్టర్ సీసాలు దాదాపుగా 63 లీటర్ల మద్యం గుర్తించి వాటిని స్వాధీనం చేసు కున్నారు. కేసు నమోదు చేసి ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

అంకపాలెంలో భూ వివాదం

అధికార పార్టీ నాయకుల దాడిలో గాయపడ్డ టీడీపీ సభ్యులు

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 19 : పి.అంకంపాలెంలో నెలకొన్న భూవివాదంలో అధికార పార్టీకి చెందిన ఒ మాజీ ప్రజాప్రతినిధి ఆగడాలకు ఒక వ్యక్తి తీవ్ర గాయాల పాలవగా అదే కుటుంబానికి చెందిన మరో ముగ్గురు ఆస్పత్రి పాలయ్యారు. పి.అంకంపాలెంకు చెందిన ఆకుల దుర్గారావు కుటుంబ సభ్యులకు స్థానిక మాజీ ప్రజాప్రతినిధికి మధ్య కొంతకాలంగా భూవివాదం ఉంది. దుర్గారావు కుటుంబీకులు తమ పొలంలోకి దౌర్జన్యంగా వచ్చిన అధికార పార్టీకి చెందిన మాజీ ప్రజాప్రతినిధి మరికొందరు అతడి అనుచరుల్ని అడ్డుకున్నారు. దీంతో వారిపై మాజీ ప్రజాప్రతినిధి వర్గం కొట్టారు. దుర్గారావు తలకు మర్మాంగాలపై గాయాలయ్యాయి. 108లో జీలుగుమిల్లి పీహెచ్‌సీకి తీసుకురాగా ప్రథమ చికిత్స అనంతరం ఉన్నతవైద్యం కోసం జంగారెడ్డిగూడెం తరలించారు. ఆకుల రమేష్, ఆకుల సీతమ్మ, ఆకుల దుర్గమ్మలు గాయాలపాలయ్యారు. ఇటీవల వైసీపీలో ఉన్న బాధిత కుటుంబీకులు మాజీ సర్పంచ్ తీరుపట్ల అసంతృప్తితో గ్రామంలో జరిగిన టీడీపీ బీసీ సమావేశంలో ఆ పార్టీలో చేరారు. అప్పటి నుంచి మాజీ సర్పంచ్ వేధింపులకు గురి చేస్తూ వీరిని ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

సకాలంలో అర్జీలు పరిష్కరించాలి : కలెక్టర్


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 19: స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలను ప్రజలకు సంతృప్తికలిగే రీతిలో సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. కలెక్టర్‌తో పాటు జేసీ బి.లావణ్యవేణి, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, ఆర్డీవో ఎస్ఎస్‌కె ఖాజావలీ, వ్యవసాయ శాఖ జేడీ రామకృష్ణతో కలసి అర్జీలు స్వీకరించారు. స్పందన కార్యక్రమానికి 210 అర్జీలు వచ్చాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించిన తరువాత పరిష్కార విధానంపై ప్రజలకు సంతృప్తి చెందని కారణంగా దరఖాస్తులు రీఓపెన్ అవుతున్నాయన్నారు. దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా అధికారులు, సిబ్బంది చూడాలని సూచించారు.

అపరిచితుల మెసేజ్‌లతో అప్రమత్తంగా ఉండాలి : ఏఎస్పీ


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏఎస్పీ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 19: సోషల్ మీడియా ద్వారా అపరిచితులు పంపించే లింకులను, మెస్సేజ్‌లతో అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ స్వరూప రాణి సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందనలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 45 ఫిర్యాదులను స్వీకరించారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆమె మాట్లాడుతూ అపరిచితులు పంపించే వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, టెస్టు మెస్సేజ్‌లను ఓపెన్ చేయడం వల్ల ఫోన్‌లో డేటా వారికి చేరుతుందని, బ్యాంక్ ఖాతాలో సొమ్ము కూడా వారు బదిలీ చేసుకుంటారని అన్నారు. కొంతమంది ఫోన్‌చేసి పొరపాటున మీ ఖాతాలో సొమ్ములు పడ్డాయని ఓటీపీ నెంబర్ చెప్పాలని అడుగుతారని, నమ్మవద్దని సూచించారు.

కుష్ఠు నివారణకు అంకితభావంతో పనిచేయాలి : జేడీ


వైద్యసిబ్బందితో సమావేశమైన జేడీ

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 19: జిల్లాలో కుష్ఠువ్యాధి తీవ్రత నివారణకు క్షేత్రస్థాయిలో వైద్యసిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాలని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ జేడీ సాగరానంద్ సూచించారు. జిల్లాలో కుష్ఠు నియంత్రణ కార్యక్రమాలను పరిశీలించేందుకు సోమవారం నగరంలోని పలు అర్బన్ పీహెచ్‌సీలను సందర్శించారు. వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుష్ఠు లక్షణాలు కనబడితే వారిని ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి రిఫర్ చేయాలని, వ్యాధి నిర్ధారణ పరీక్షల అనంతరం చికిత్స అందించాలన్నారు. కుష్ఠు బాధితుల పింఛన్ మంజూరుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. బాధితులకు ప్రత్యేకంగా తయారు చేసిన చెప్పులను సరఫరా చేశారు. జిల్లా ఇమ్యునైజేషన్, టీబీ, లెప్రసీ నియంత్రణ అధికారి డాక్టర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల రిలే నిరాహార దీక్షలు


రిలే నిరాహార దీక్ష చేస్తున్న న్యాయవాదులు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 19: లాండ్ టైటిలింగ్ యాక్టును తక్షణం రద్దు చేయాలని న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలను సోమవారం కొనసాగించారు. ఏపీ లాండ్ టైటిలింగ్ యాక్టు 27/23ను ప్రజా వ్యతిరేక కొత్త చట్టమని దీనిని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏలూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు కొన్ని రోజుల నుంచి ఈ చట్టానికి నిరసనగా కోర్టు విధులను బహిష్కరిస్తూ ఏలూరు జిల్లా కోర్టు గేటు బయట రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తున్నారు. మార్చి 7 వరకూ కోర్టు విధులను బహిష్కరిస్తున్నామని ప్రకటించారు. చట్టం రద్దు చేయకుంటే ప్రజలతో కలిసి ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

వైభవంగా పేరంటాలమ్మ ఉత్సవాలు


ఉత్సవాల్లో విద్యుత్ కాంతులు

దెందులూరు, ఫిబ్రవరి 19: గాలాయగూడెం గ్రామ దేవత అచ్చమ్మ పేరంటలు ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, మాజీ ఎంపీ మాగంటి బాబు, టీడీపీ ఏలూరు ఇన్‌చార్జి బడేటి చంటి, పూజారి నిరంజన్‌రావు, తదితరులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పూజారి శ్రీనివాసరావు, ఏనుగు రామకృష్ణ, పెద్దిశెట్టి నాని స్వాగతం పలికారు. జనసేన నేతలు ఘంటశాల వెంకటలక్ష్మి, రెడ్డి అప్పలనాయుడు, తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో గ్రామస్తులు

దెందులూరు, ఫిబ్రవరి 19: దెందులూరు తామర చెరువు గట్టు వద్ద అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్వహణ కమిటీ చైర్మన్ పగడాల సురేష్, సాయి రామలక్ష్మి దంపతులు, సానిగూడెం, దెందులూరు, అలుగులగూడెం, ఉప్పుగూడెం గ్రామస్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో పునఃప్రతిష్ఠ చేశారు. కొలుసు గణపతి, గంచిరి చిన్న రంగారావు, కుందేటి సత్యనారాయణ, పంది నాగరాజు, అంబటి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు,

తడికలపూడి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ


అభయాంజనేయస్వామికి పూజలు

కామవరపుకోట, ఫిబ్రవరి 19 : తడికలపూడిలో నిర్మించిన ఆలయంలో సోమవారం అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. భక్తులు సామూహిక పూజలు చేశారు. తమలపాకులు, సింధూరంతో అర్చనలు నిర్వహించారు. వీరేంద్ర, సందీప్, అశోక్, అజయ్, చొక్కా నాగరాజు, నంబూరి భాస్కరరావు, నల్లూరి సురేష్ భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, సొంగా రోషన్‌కుమార్, బొప్పన అంజియ్య, తూతా లక్ష్మణరావు స్వామి వారిని దర్శించుకున్నారు.

శివాలయాల్లో అభిషేకాలు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 19: నగరంలోని శివాలయాల వద్ద సోమవారం అభిషేకాలు, బిల్వార్చన నిర్వహించారు. సత్యనారాయణపేట గంగా పార్వతీ సమేత గాంగేశ్వరస్వామి, బావిశెట్టివారిపేట కాశీ విశ్వేశ్వరస్వామి, నాగేశ్వరపురం శివాలయం, జలా పహరేశ్వరస్వామి, మార్కండేయస్వామి, నగరేశ్వరస్వామి, కాశీ విశ్వేశ్వరస్వామి, రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

షిరిడీ సాయి నాథుడికి అభిషేకాలు


షిరిడీ సాయిబాబా ఆలయంలో పూజలు

పెదవేగి, ఫిబ్రవరి 19: బాపిరాజుగూడెం షిరిడి సాయి ఆలయ దశమ వార్షికోత్సవాలు పూజలు వైభవంగా జరిగాయి. ఐదు రోజులుగా జరుగుతున్న వేడుకలు సోమవారం ముగిశాయి. సాయినాథుడికి పంచామృత అభిషేకాలు, 108 కలశాలతో వివిధ నదీ జలాలు, 108 లీటర్ల ఆవుపాలతో అభిషేకాలు చేశారు. వివిధ రకాల పండ్లు, మధుర పదార్థాలతో సహస్ర నామార్చన నిర్వహించారు. అనంతరం జంటనాగుల విగ్రహ ప్రతిష్ఠ చేసి, శ్రీవల్లీ దేవసేవ సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. గోశాలలో గరుకు స్తంభం ప్రతిష్ఠ చేశారు. భారీ అన్నసమారాధన, సాయినాథుని గ్రామోత్సవం జరిపారు.

నేటి నుంచి నారసింహుని కల్యాణ మహోత్సవాలు



ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 18: చినవెంకన్న ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాధపురంలోని శ్రీలక్ష్మీ నారసింహుని దివ్యక్షేత్రంలో మంగళవారం నుంచి కల్యాణ మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరిస్తారు. సుందరగిరిపై కొలువైన ఆలయంలో భీష్మ ఏకాదశి పర్వదినం మొదలుగా ఈనెల 25 వరకూ కల్యాణ మహోత్సవాలు జరుగనున్నాయి. ఈనెల 22 ఉదయం 11.10 గంటలకు స్వామివారి కల్యాణాన్ని కొండ దిగువనున్న కల్యాణమండపంలోనే నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

వైసీసీ పాలకుల్లో అభద్రత


కంసాలిగుంటలో ప్రజలను కలసిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని


టీడీపీ ఏలూరు కార్యాలయంలో మాట్లాడుతున్న బడేటి చంటి

• ప్రతిపక్షాలు, మీడియాపై కూడా దాడులకు తెగబడుతున్నారు • త్వరలో ప్రజలు ఇంటికి పంపించేస్తారు : ప్రభుత్వంపై టీడీపీ నేతల ధ్వజం

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 19: ఎన్నికలు సమీపిస్తున్న వేళ ముఖ్యమంత్రి జగన్‌కు అభద్రతాభావం కలుగుతుందని టీడీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి అన్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎంతమంది కలిసి వచ్చినా వెంట్రుక కూడా పీకలేరని ప్రగల్భాలు పలికారని, ఇప్పుడేమో అందరూ ఏకమై తనను ఒంటరిని చేస్తున్నారని బేలమాటలు మాట్లాడుతున్నాడని అన్నారు. వైసీపీ పాలనలో ప్రతిపక్షాలపై దాడులు సాధారణం కాగా మీడియాపై కూడా దాడులకు తెగబడుతున్నారన్నారు. జగన్‌లో ఓటమి భయం పట్టుకుందనేది అర్థమవుతుందన్నారు. అనంతపురం రాప్తాడు సిద్ధం సభలో టీడీపీ హయాంలో అభివృద్ధి జరగలేదన్నట్లు జగన్ మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండించారు. అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని చంద్రబాబు సవాల్ చేశారని, మీరు సిద్ధామేనా అని బడేటి చంటి ప్రశ్నించారు. ఒక పక్క సొంత చెల్లి రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి లేదని పలుకుతుంటే అర్థకావడం లేదా అని నిలదీశారు. సైకిల్ తొక్కితే ఆరోగ్యం, టీ తాగితే ఉల్లాసం, ఫ్యాన్ ముట్టుకుంటే కరెంటు షాక్ అని వ్యాఖ్యానించారు. పట్టణాలు, పంచాయతీల్లో రోడ్లు వేసిన ఘనత టీడీపీది అన్నారు. అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదన్నారు. ఫ్యాన్ రెక్కలు విరగ్గొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాప్తాడు సభలో ఆంధ్రజ్యోతి ఏబీఎన్ ఫోటోగ్రాఫర్‌పై దాడి హేయమైన చర్య అన్నారు. మీడియా వారిపై విచక్షణ మరచి దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు, మాజీ కార్పొరేటర్లు చోడే వెంకటరత్నం, మారం హనుమంతరావు, బాలాజీ, శివప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.


కుక్కునూరు మండలం మారేడుబాకలో బొరగం, నేతల ప్రచారం

● ఉంగుటూరు: రాష్ట్రంలో అభివృద్ధి తెలుగుదేశం-జనసేన కూటమి విజయంతోనే సాధ్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. కంసాలిగుంట, నల్లమాడు గ్రామాలలో మన ఇంటికి మన గన్ని కార్యక్రమం నిర్వహించారు. కంసాలిగుంట సర్పంచ్ ముంద్రు శాంతి, పిప్పర శ్రీను, శ్రీకాంత్, తానిబోయిన చిట్టిమళ్ళ విజయరాజు, నల్లమాడులో సుంకవల్లి నాని, మధు, ఆచంట సత్యనారాయణ, పెనుమాక డేవిడ్‌రాజు, మండల స్థాయి నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

● నిడమర్రు: రానున్న ఎన్నికలలో ఫ్యాన్ రెక్కలు విరిచేయడానికి జనం సిద్ధంగా ఉన్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. క్రొవ్విడిలో విలేకరులతో మాట్లాడుతూ అభివృద్ధి పాలన, విధ్వంస పాలనపై చర్చించేందుకు వైసీపీ సిద్ధమా అని సవాల్ విసరారు. రాష్ట్రంలో ఏమూల చూసినా విధ్వంసం కనిపిస్తోందని ధ్వజమెత్తారు. సిద్ధం సభల పేరుతో వందల కోట్లు ప్రజాధనం ఖర్చుచేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని గన్ని విమర్శించారు. జగన్ చెబుతున్న అసత్యాలు నిగ్గు తేల్చేందుకు తామంతా సిద్ధమేనని ఆయన అన్నారు. సమావేశంలో గఫార్‌ఖాన్, సారికె లెనిన్‌బాబు, ఆదిరెడ్డి చంద్రరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

● కుక్కునూరు: చంద్రబాబు సీఎం అయితేనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు అన్నారు. మారేడుబాకలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం, జనసేన కూటమి అధికారంలోకి రాగానే అమలు చేసే సూపర్ సిక్స్ పథకాలు వివరించారు. పోలవరం ప్రాజెక్ట్ కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులను జగన్ మోసం చేశాడన్నారు. వరదల సమయంలో ఇబ్బందుల్లో ఉంటే గాలికి వదిలేశారని ఆరోపించారు. ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పి తెలుగుదేశం పార్టీని గెలిపించాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, ఎంపీటీసీ ముప్పాళ్ళ శ్రీదేవి, ముప్పాళ్ళ శివయ్య, ముప్పాళ్ళ సత్యనారయణ, కోటగిరి సత్యనారాయణ, పిచ్చుక రాజు, వనమా భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

'జగన్ రెడ్డి నియంత పాలనను పారదోలుదాం'


భీమడోలులో జనసేన నేతల నిరసన

భీమడోలు, ఫిబ్రవరి 19: ప్రశ్నించే గొంతులను అధికారంతో అణగదొక్కాలని చూసే జగన్‌రెడ్డి నియంత పాలన పారదోలదామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు పిలుపునిచ్చారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై క్రిమినల్ కేసులు పెట్టడాన్ని ఖండిస్తూ భీమడోలు అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ధర్మరాజు మాట్లాడుతూ పవన్ కల్యాణ్‌ను చూస్తే ముఖ్యమంత్రికి భయం పుడుతుందని, అందుకే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ప్రత్తి మదన్, రామ్మూర్తి, దౌలూరి సునీల్, నీలం అజయ్, ఈతకోట సత్య కృష్ణ, టీడీపీ నేతలు సుబ్రమణ్యం, శేషపుగిరి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జన సేన సామూహిక నిరాహార దీక్ష

చింతలపూడి, ఫిబ్రవరి 19: జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 21, 22 తేదీల్లో చింతలపూడి మండలం, పట్టణ సమస్యల పరిష్కారం కోరుతూ సామూహిక నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు నియోజకవర్గ కన్వీనర్ మేకా ఈశ్వరయ్య తెలిపారు. మండలంలోని రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, నామవరం, సీతానగరం, బాలావారిగూడెం, తుమ్మగూడెం, గురుభట్లగూడెం, కామవరపుకోట, శివపురం, పోతునూరు, ఏలూరు రోడ్డు, రాష్ట్ర సరిహద్దు రోడ్లు దారుణంగా ఉన్నాయన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలని, చింతలపూడి పట్టణంలో సెంట్రల్ లైటింగ్, డ్రైయినేజీ, వీధి రోడ్లు గత ఐదేళ్లుగా పరిష్కారం కాలేదన్నారు. స్థానికులు ప్రజలు దీక్షలకు సహకారం అందించి విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో చీదరాల మధుబాబు, టి.నాగవిజయకుమార్ పాల్గొన్నారు.

చేబ్రోలులో జనంలోకి జన సేన

ఉంగుటూరు,ఫిబ్రవరి 19: ప్రజా సమస్యల పరిష్కారంలో జగన్ ప్రభుత్వం విఫలమైందని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. చేబ్రోలులో సోమవారం జనంలోకి జనసేన కార్యక్రమం జరిగింది. పంది రాంబాబు, నగరపాటి ఫణీంద్ర, ఇల్లిందల సురేష్ పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి


వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 19: ఇటీవల తుఫాన్‌తో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు వెంకట రామ్‌ప్రసాద్ కోరారు. స్పందనలో సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కైకలూరు, దెందులూరు నియోజకవర్గాల్లో నీరు లేక అపరాలు పంటలు ఎండిపోయాయన్నారు. పంట కాల్వల ద్వారా నీరు విడుదల చేయాలన్నారు. నడపన భాస్కర్, గాది రాంబాబు, శ్రీకృష్ణదేవరాయులు, ఎం.శ్రీనివాస్ శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


తడికలపూడి ఎరువుల దుకాణంలో తనిఖీ

కామవరపుకోట, ఫిబ్రవరి 19: మండలంలో ఎరువుల దుకాణాలను ఇంటర్నల్ స్క్వాడ్ ప్రతినిధులు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కేఆర్.పురం ఏడీఏ బుజ్జిబాబు పలు దుకాణాల్లో రికార్డులు, నిల్వలు తనిఖీ చేశారు. ప్రతీ ఎరువుల దుకాణం వద్ద ధరల పట్టిక ఉండాలని, స్టాక్ వివరాలు కూడా బోర్డులో నమోదు చేయాలని చెప్పారు. తూకంలో తేడా ఉండకూడదన్నారు. ఏవో పవన్‌కుమార్, తదితరులు ఉన్నారు.

కరాటే పోటీల్లో ఏలూరు విద్యార్థుల ప్రతిభ

ఏలూరు స్పోర్ట్స్, ఫిబ్రవరి 19: మచిలీపట్నంలో జరిగిన ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో ఏలూరు విద్యార్థులు పతకాలు సాధించారు. దీపక్ కటా విభాగంలో కుమార్‌స్వామి, భవన్, శరణ్య, నందీశ్వర్‌రెడ్డి ప్రథమస్థానాలు సాధించారు. మెహర్ ఉన్నీసా కటాలో ప్రథమ, డి.అబ్రహం, వైభవ్ బాలాజీ, వాసువర్ధన్ కటాలో ద్వితీయస్థానాలు సాధించారు. డింపూ, మోహిత్, వీరేంద్రసింగ్ కటాలో ద్వితీయస్థానం సాధించారు. రాజు, ధర్మతేజ, ఆదిత్య కూడా ద్వితీయ స్థానాలతో పతకాలు సాధించారు.

శాంతి భద్రతలపై అప్రమత్తంగా ఉండాలి : డీఎస్పీ


సబ్ డివిజన్ అధికారులతో డీఎస్పీ

పోలవరం, ఫిబ్రవరి 19: శాంతి భద్రతలపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ ఎన్. సురేష్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించి సబ్ డివిజన్ పరిధిలోని సీఐ, ఎస్ఐలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ మద్యం అక్రమ రవాణాపై దృష్టి సారించాలన్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

డీడీవోల నియామకం జీవో వెంటనే అమలు చేయాలి


డీపీవోకు వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

పెదపాడు, ఫిబ్రవరి 19: గ్రేడ్ - 5 పంచాయతీ కార్యదర్శులను డీడీవోలుగా నియమిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో వెంటనే అమల్లోకి తీసుకురావాలని కోరుతూ మండలంలో వివిధ పంచాయతీల కార్యదర్శులు డీపీవో తూతిక విశ్వనాథంకు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. కార్యదర్శుల వినతి మేరకు డీడీవోలుగా అమలు ప్రక్రియను సత్వరమే జరిగేటట్లు చర్యలు తీసుకుంటామని డీపీవో విశ్వనాథ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రేడ్ - 5 పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● ఏలూరు సిటీ: పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్-5 వారికి డిడిఓ అధికారాలు ఇస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేయడంపై పలువురు కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలోని పంచాయతీ గ్రేడ్-5 కార్యదర్శులు జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. జీవోను సత్వరమే అమలు చేయాలని వారు కోరారు.

పోలవరం జిల్లా సాధనకు పోరు

పోలవరం, ఫిబ్రవరి 19: పోలవరం జిల్లా సాధనకు ప్రతి ఒక్కరూ ఒకరోజు కేటాయించాలని జిల్లా సాధన సమితి జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, పోలవరం, ఇటుకలకోట, ఎల్ఎన్‌డీపేట, వింజరం, చేగొండపల్లి, ప్రగడపల్లి, జిల్లెల్లగూడెం పంచాయతీల పరిధిలో సోమవారం కరపత్రాలు పంచి మైక్ ప్రచారం చేశారు. ఏటిగట్టు సెంటర్‌లో మంగళవారం మహా ధర్నా నిర్వహించనున్నట్లు జేఏసీ నేతలు తెలిపారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాళం గాంధీ, బుగ్గా మురళీకృష్ణ, గంగు అనిల్‌కుమార్, కొణతాల ప్రసాద్, కరిబండి నాగరాజు, గునపర్తి చిన్ని తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన అవసరం

లింగపాలెం, ఫిబ్రవరి 19: మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని ఎంఈవో రవీంద్ర అన్నారు. ధర్మాజీగూడెం, గోకవరం పాఠశాలల్లో సోమవారం జరిగిన కాంప్లెక్స్ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు సాంకేతిక సామర్థ్యాన్ని పెంచుకుని విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకునే విధంగా ఉపాధ్యాయులతో చర్చించుకోవాలని అన్నారు. వాటిని విద్యార్థులకు కావాల్సిన విధంగా వారికి అర్థమయ్యేరీతిలో బోధించటమే ఈ సమావేశాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. హెచ్ఎం బీవీఎస్ఎన్.రాజు, నరసింహారావు, జి.స్వామి, సిఆర్పీలు కుమార్‌మంగళం, కనకరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులకు ఆర్థిక సాయం

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 19: దేవరపల్లి మండలం యర్నగూడెంకు చెందిన పూర్వ విద్యార్థులు (2004-2005) హెల్పింగ్ హాండ్స్ వెల్ఫేర్ సొసైటీగా ఏర్పడి సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. రెడ్డిగణపవరానికి చెందిన పూర్వ విద్యార్థి తడికమళ్ళ జ్యోతికి ప్రమాదంలో కాలికి గాయం కావడంతో సొసైటీ తరఫున రూ.3 వేలు ఆర్థిక సాయం చేశారు. అచ్చియ్యపాలెంకు చెందిన ఇందిర తల్లి ప్రమాదంలో గాయపడి మృతి చెందడంతో వారి కుటుంబానికి సొసైటీ తరఫున రూ.17 వేల సాయం చేశారు. అధ్యక్ష, కార్యదర్శులు టి.ప్రసాద్, కె.బాలకిషోర్, శ్రీను, అంజి, రాజు, తనూజ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఉంగుటూరు, ఫిబ్రవరి 19: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను నిడమర్రు సీఐ సుభాష్, చేబ్రోలు ఎస్ఐ మణికుమార్ సోమవారం పరిశీలించి మౌలిక వసతులపై ఆరా తీశారు. దివ్యాంగులకు ర్యాంపు సదుపాయం తదితర అంశాలపై పంచాయతీ అధికారులకు సూచనలు చేశారు.

జాతి నిర్దేశకుడు ఛత్రపతి శివాజీ


ఛత్రపతి శివాజీ జయంతి శోభాయాత్ర

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 19: యువతకు ఛత్రపతి శివాజీ స్ఫూర్తి అని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు అన్నారు. శివాజీ జయంతి సందర్భంగా సోమవారం శోభాయాత్ర నిర్వహించారు. ప్రతీ ఒక్కరూ ఛత్రపతి శివాజీ జీవిత చరిత్రను తెలుసుకుని అందరికీ తెలియచేయాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందన్నారు. ఒబిలిశెట్టి శ్రావణకుమార్ గుప్త, జనసేన కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. తొలుత ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తపన చౌదరి సేవా కార్యక్రమాల ప్రచారం


జబర్దస్త్ కళాకారులు, అనంతశ్రీరామ్

పెదపాడు, ఫిబ్రవరి 19: బీజేపీ నేత, తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి సేవా కార్యక్రమాలపై జబర్దస్త్ కళాకారులు సోమవారం ప్రచారం చేశారు. సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ మాట్లాడుతూ తపనా చౌదరిని ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారన్నారు. జబర్దస్త్ కళాకారులు, సినీ గాయకుల బృందం పెదపాడు, కొత్తూరు, వట్లూరు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. జబర్దస్త్ కళాకారులు అదిరే అభి, అప్పారావు, బాబీ, వినోద్, ఇమ్మాన్యుయేల్ కామెడీ షోతో, సినీ గాయకులు వినూత్న, అరుణ్ కౌండిన్య పాటలతో అలరించారు. గుమ్మడి చైతన్య, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పది పరీక్షల విధుల నుంచి మినహాయింపు ఇవ్వండి

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 19: పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ, మూల్యాంకన విధుల నుంచి కొందరికి మినహాయింపు ఇవ్వాలని పలువురు టీచర్లు కోరుతున్నారు. 55 ఏళ్ల వయస్సు టీచర్లు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, గర్భిణులకు, బాలింతలకు మినహాయింపునివ్వాలని సోమవారం ఏలూరు ఎంఈవోకు వినతిపత్రాన్ని అందజేసినట్టు ఏపీటీఎఫ్ నగరశాఖ అధ్యక్ష, కార్యదర్శులు కె.ఆనంద్‌కుమార్, ఎ.శ్రీనివాసరావు తెలిపారు. పరీక్షల నిర్వహణ సిబ్బందికి విధుల కేటాయింపులో పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు.

కోటగిరి విద్యాధరరావు విగ్రహావిష్కరణ


విగ్రహావిష్కరణలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీధర్

లింగపాలెం, ఫిబ్రవరి 19: ఆసన్నగూడెంలో దివంగత మాజీమంత్రి కోటగిరి విద్యాధరరావు విగ్రహాన్ని ఎంపీ కోటగిరి శ్రీధర్ సోమవారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ఆయన అందించిన సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు. తనను కూడా ఏలూరు ఎంపీగా గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గానికి తన కుటుంబం ఎంతో రుణపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటు ఏఎంసీ చైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, కొటారు మోహన్‌రావు, ఇనుగంటి సతీష్, పలువురు గ్రామస్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు కార్పొరేషన్ :** కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా చైర్మన్‌గా జంగారెడ్డిగూడెంకు చెందిన బొడ్డు శ్రీనివాసరావును నియమిస్తూ ఏపీ లీగల్ సెల్ చైర్మన్ డాక్టర్ జంధ్యాల శాస్త్రి ఉత్తర్వులు జారీ చేశారు.
- **ఏలూరు రూరల్ :** మార్కెట్ యార్డ్ హమాలీలకు ఎమ్మెల్యే ఆళ్ళ నాని రెండు జతల యూనిఫామ్, రెండు టవల్స్ అందజేశారు. ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పాల్గొన్నారు.
- **ఏలూరు స్పోర్ట్స్ :** ఆదివారపుపేట ఏఆర్‌డీజీకే మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి రెడ్డి భవాని పాట్నాలో జరిగిన వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో 45 కేజీల రజత పతకం సాధించినట్లు హెచ్ఎం ఓ.ఎస్ ఉజ్వల తెలిపారు.
- **కామవరపుకోట :** మండల పరిషత్ సమావేశం ఈనెల 24న ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో జంగం స్వర్ణభారతి తెలిపారు.
- **టి.నరసాపురం :** మధ్యాహ్నపువారిగూడెం గ్రామ శివారులో ఈనెల 13న సారా తయారీ స్థావరంపై పోలీసులు దాడి చేసి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఎడ్లపల్లి ఏసు పారిపోయాడు. కాగా సోమవారం అతడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మహేశ్వరరావు తెలిపారు.
- టి.నరసాపురం మండలంలోని వుట్రేపు రోడ్డు పనులను జడ్పీటీసీ సూర్యనారాయణ రాజు సోమవారం ప్రారంభించారు. ఎంపీటీసీలు నార్లపాటి వెంకటేశ్వరరావు, అర్జా బాలయ్య, పాల్గొన్నారు.
- **కుక్కునూరు :** దాచారం గ్రామానికి చెందిన ఇరకం ముత్తయ్య ఇల్లు అగ్నిప్రమాదంలో దగ్ధం కావడంతో సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో దుప్పట్లు, చీరలు, రూ.వెయ్యి నగదు, నిత్యావసర వస్తువులు అందజేశారు. తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసరాలు, దుస్తులు, దుప్పట్లు, వంటసామగ్రి అందజేశారు.
- **ఉంగుటూరు :** విశ్వ బ్రాహ్మణులు ఐక్యంగా ఉండాలని మండల సంఘం అధ్యక్షుడు అనుపోజు వీరబ్రహ్మం కోరారు. ఈ నెల 25న జిల్లా విశ్వ బ్రాహ్మణ కీర్తి పురస్కారాల సభకు సభ్యులంతా తరలి రావాలన్నారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** ఉంగుటూరు మండలం గొల్లగూడెంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ పాండ్రాకుల తేజో ఫణీంద్ర తెలిపారు.


కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న గిరిజనులు


ఏలూరు నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా

కొత్తూరు నిర్వాసితులకు ఇళ్లు కేటాయించాలి

కుక్కునూరు, ఫిబ్రవరి 19: మర్రిపాడులో పోలవరం నిర్వాసితులకు నిర్మిస్తున్న ఇళ్లలో భాగంగా కొత్తూరు గిరిజన నిర్వాసితులకు కేటాయించిన ఇళ్లు ముందుగానే ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు ప్రభుత్వాన్ని కోరారు. కొత్తూరు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం పోలవరం ముంపు పేరుతో మండలంలో అభివృద్ధిని పూర్తిగా నిలిపివేశారని విమర్శించారు. కనీసం మండలంలో పరిష్కరించగలిగే సమస్యలను కూడా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. మాధవరం పంచాయతీ కొత్తూరులో దాదాపు 60 కుటుంబాలు నివాసం ఉండగా వారికి గడ్డి, తాటియాకుల ఇళ్లతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. మర్రిపాడు నిర్వాసితుల కాలనీలో వారి కోసం నిర్మిస్తున్న ఇళ్లకు విద్యుత్, మంచినీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఊకె ముత్తయ్య, సోడే సత్యవతి, మిడియం కృష్ణ, సరియం రాజమ్మ, గొంది వీర్రాజు, మిడియం పిచ్చయ్య, కొండ్రు ప్రసాద్, మడకం రమాదేవి, తోడేం కాంతమ్మ, తోడేం వెంకటమ్మ పాల్గొన్నారు.

కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఏలూరు టూటౌన్: నగరంలో పలు కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్రంగా ఇబ్బందులుపడుతున్నారని సీపీఎం నాయకులు సోమయ్య అన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద వివిధ కాలనీల ప్రజలు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు కాలనీలో తాగునీరు, డ్రెయినేజీలు, రోడ్లు, వీధిలైట్లు, ఇళ్ల పట్టాలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని అన్నారు. తక్షణమే కాలనీలో సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి కిషోర్, ఈశ్వరమ్మ, సరోజిని, అన్నపూర్ణ, కుమారి, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ముదినేపల్లి వద్ద కూలిన అన్నవరం చానల్ రక్షణ గోడలు

పంట కాల్వ ఇలా.. సాగునీరందేది ఎలా?

▸▸అధ్వానంగా అన్నవరం బ్రాంచి కాల్వ

ముదినేపల్లి, ఫిబ్రవరి 19 : వందలాది ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించే పోల్ రాజ్ సౌత్ సైడ్ బ్రాంచి చానల్ నుంచి చీలిన అన్నవరం చానల్ అధ్వానంగా మారింది. పోల్ రాజ్ ప్రధాన పంట కాల్వ నుంచి అన్నవరం వరకు ఈ బ్రాంచి కాల్వ పూడిపోవటమే కాక, సిమెంట్ నిర్మాణాలు కూడా కూలిపోయాయి. దీంతో ఈ చానల్ కింద ఆయకట్టు భూములకు సకాలంలో సాగు నీరందడం లేదు. ముదినేపల్లి, వడాలి, పెయ్యేరు, అప్పారావుపేట, అన్నవరం గ్రామాలకు చెందిన ఈ అన్నవరం చానల్ ఏళ్ల తరబడి తవ్వకాలకు నోచుకోలేదు. ఉపాధి పథకం కింద నిబంధనల ప్రకారం కొంతమేరకు తవ్వటం తప్ప, పూర్తిస్థాయిలో అవసరమైనంత లోతు తవ్వ లేదు. అన్నవరం చానల్ నిర్వహణ కూడా లోప భూయిష్టంగానే ఉంది. గుర్రపు డెక్క, ఇతర ఆటంకాలను కూడా తొలగించేందుకు జల వనరుల శాఖ అధికారులు చర్యలు తీసుకోలేదు. వడాలి కల్వర్టు వద్ద ఈ చానల్‌కు ఇరువైపులా గట్లు కోసుకుపోకుండా నిర్మించిన సిమెంట్ గోడలు ఒక పక్క పూర్తిగా కూలిపోగా, మరో పక్క ఒరిగిపోతున్నాయి. వాటిని పునర్నిర్మించి అన్నవరం చానల్ గట్ల కోతను నివారించేందుకు గత 15 ఏళ్లగా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. వచ్చే సార్వా సీజను నాటికైనా ఈ ఛానల్‌ను అభివృద్ధి చేయాలని అన్నవరం రైతులు కోరుతున్నారు.



స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కిసాన్‌మోర్చా నాయకులు

సమస్యల పరిష్కారమేదీ: కిసాన్ మోర్చా

కైకలూరు, ఫిబ్రవరి 19: స్పందనలో ప్రజా సమస్యలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా అవి పరిష్కారం కావడం లేదని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కీర్తి వెంకట రామ్ ప్రసాద్ అన్నారు. సోమవారం ఏలూరులో జరిగిన స్పందనలో కైకలూరులోని పలు సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు. 2023 మే 1న కైకలూరులో జరిగిన స్పందన కార్యక్రమంలో తాలుకా సెంటర్లో సులాబ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని, వాటర్ ప్లాంట్ నిర్మించాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినా రెండు సమస్యలు నేటి వరకు పరిష్కారం కాలేదని స్పందనలో ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యమన్నారు. సంవత్సర కాలం గడుస్తున్నా సమస్యలు పూర్తికాకపోవడం బాధాకరమని అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.



ప్రకృతి ఉత్పత్తులు విక్రయిస్తున్న దృశ్యం

ప్రకృతి సేద్యంతో ఆరోగ్య ఉత్పత్తులు

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 19: చిన్నతనంలోనే థైరాయిడ్, బీపీ, క్యాన్సర్, గుండె జబ్బులు వంటి రుగ్మతల నుంచి దూరంగా ఉండేందుకు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వాడాలని ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జ్ ఆల్ఫాన్సా రాణి తెలిపారు. ఏ విధమైన రసాయన ఎరువులు వాడకుండా పండించే పంటల వల్ల అనారోగ్యం ఉండదని, రసాయనాలు వాడటం వల్ల భూమిసారం దెబ్బ తింటుందని కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఈ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ఉంటుందని, ఈ ఉత్పత్తులు వాడి ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆల్ఫాన్సా రాణి తెలిపారు.



బాధిత కుటుంబాలకు అట్లూరి ట్రస్ట్ చేయూత

ముసునూరు, ఫిబ్రవరి 19: గుడిపాడులో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో పల్లె నాగేశ్వరరావు, పల్లె రాంబాబు ఇళ్లు దగ్ధమై రెండు కుటుంబాలు నిరాశ్రయులవడంతో అట్లూరి చారిటబుల్ ట్రస్ట్ చేయూతనిచ్చింది. సోమవారం ఒక్కొక్క కుటుంబానికి రూ. 5 వేలు నగదు, నిత్యావసర సరుకులు, వంట సామగ్రి, కొత్త బట్టలను ట్రస్ట్ చైర్మన్ అట్లూరి వెంకట రవీంద్ర అందజేశారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు మండలపు బుజ్జియ్య, నాయకులు మండలపు ధర్మ రాజు, పల్లె వెంకటేశ్వరరావు, లక్కపాము కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

పెదలంకలో ప్రభుత్వ భవనాలు ప్రారంభం

కలిదిండి, ఫిబ్రవరి 19 : పెదలంకలో సోమవారం గ్రామ సచివాలయ, రైతు భరోసా, ఆరోగ్య ఉప కేంద్రం భవనాలను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణ, ఎంపీ కోటగిరి శ్రీకాంత్‌లతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మూడు ఒకే ప్రదేశంలో ఉండటం ప్రజలకెంతో ఉపయోగకరమన్నారు. కారుమూరి సునీల్ కుమార్, ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జడ్పీటీసీ బొర్రా సత్యవతి, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, మాజీ చైర్మన్ బ్రహ్మాజీ రావు, సర్పంచ్ లక్ష్మీ రామకృష్ణ, సొసైటీ చైర్మన్ గణపతి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కొత్తింటికి వాటరింగ్ చేస్తూ..



సునీంద్రరావు (ఫైల్)

చాట్రాయి, ఫిబ్రవరి 19: మండలంలో మర్లపాలెంలో పెయింటింగ్ కార్మికుడు పెదగవళ్ళ సునీంద్రరావు(30) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఆదివారం రాత్రి సునీంద్రరావు తాను కొత్తగా నిర్మించుకుంటున్న ఇంటి గోడలకు వాటరింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లగా వెంటనే అతనిని నూజివీడు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారని కుటుంబ సభ్యులు తెలిపారు. చాట్రాయి ఎస్సై కేసీహెచ్ స్వామి సిబ్బందితో సోమవారం నూజివీడు ప్రభుత్వాసుపత్రికి వెళ్ళి శవ పంచనామా జరిపించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మద్యం స్వాధీనం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 19: తెలంగాణ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు నూజివీడు రూరల్ పోలీసులు తెలిపారు. నూజివీడు రూరల్ ఎస్సై మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో నూజివీడు మండలం గొల్లపల్లి గ్రామంలో తెలంగాణ మద్యం విక్రయిస్తున్న చోడగిరి విల్సన్‌ను అదుపులోకి తీసుకుని అతని నుంచి 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.



కలిదిండిలో పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణం

ప్రమాదమని తెలిసీ..

▸▸వాహనాల్లో పరిమితికి మించి కూలీల తరలింపు

▸▸ఎన్ని ప్రమాదాలు జరిగినా కలగని కనువిప్పు..

▸▸పట్టించుకోని అధికారులు

కలిదిండి, ఫిబ్రవరి 19 : ప్రమాదమని తెలిసీ పరిమితికి మించి వాహనాల్లో కూలీలు పనులకు తరలివెళ్తున్నారు. ఒక పక్క కూలీలు అధిక సంఖ్యలో వెళ్తున్న వాహనాలకు ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ పట్టించుకోవటం లేదు. మండలంలో పలు వాహనాలు ప్రమాదానికి గురై కూలీలు మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. ఉదయాన్నే అధిక సంఖ్యలో కూలీలు బొలెరో వాహనాల్లో వలలతో చెరువుల్లో చేపల పట్టుబడికి వెళ్తున్నారు. చెరువుల వద్దకు త్వరగా వెళ్లాలనే ఆదుర్దాతో మితిమీరిన వేగంతో వాహనాలను నడుపుతుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే లంక గ్రామాల్లో చేప పిల్లలను తీసుకెళ్లే వాహనాలను అతివేగంగా నడపటంతో ద్విచక్ర వాహన చోదకులు భయభ్రాంతులకు గురవుతున్నారు. పలు సందర్భాల్లో చేప పిల్లల వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. పరిమితికి మించి కూలీలు వాహనాల్లో తరలివెళ్తున్నప్పటికీ పోలీసులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వాహనాల్లో అధిక సంఖ్యలో తరలిస్తే చర్యలు : ఎస్ఐ

ఈ విషయమై ఎస్ఐ ప్రియకుమార్‌ను వివరణ కోరగా, వాహనాల్లో పరిమితికి మించి అధిక సంఖ్యలో కూలీలను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మీతిమిరిన వేగంతో వాహనాలు నడుపుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని వాహనదారులతో సమావేశం ఏర్పాటు చేసి కౌన్సెలింగ్ ఇస్తామన్నారు.

అధికారం కోసం జగన్ అడ్డదారులు



ఆచవరం ఆత్మీయ సమావేశంలో మాజీ మంత్రి కామినేని

కైకలూరు, ఫిబ్రవరి 19: రానున్న ఎన్నికల్లో ప్రజలతో కలసి సమాజ శ్రేయస్సు కోసం పనిచేస్తానని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆచవరం, శ్యామలాంబపురం గ్రామాల్లో ఆత్మీయ సమావేశాలను నిర్వహించారు. ఆచవరంలో మహిళలు ఆయనకు హారతులు పట్టారు. ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 2019 వరకు 3 లక్షల కోట్లు అప్పులు ఉండేవని వైసీపీ 58 నెలల్లో 9 లక్షల కోట్లకు అప్పులను తీసుకువెళ్లారన్నారు. ఏడు సార్లు విద్యుత్ చార్జీలు పెంచి సామాన్య, మధ్య తరగతి ప్రజలను తీవ్రంగా దెబ్బతీశారని 10 రూపాయలు ఇచ్చి 100 రూపాయిలు ప్రతీ కుటుంబం నుంచి తెలియకుండా దోచేస్తున్నారని ఇది ప్రజలంతా గమనించాలన్నారు. కైకలూరు నియోజకవర్గంలో ఆక్వా ఆధారిత ఉత్పత్తులపైనే ప్రజలు జీవనం సాగిస్తున్నారని ఈ ప్రాంతానికి ప్రధానంగా కావాల్సింది నీటి వనరులని పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేయకుండా నిర్వీర్యం చేయడం వల్ల ఈ ప్రాంతం ఎంతో నష్టపోతోందన్నారు. జగన్ తను కోర్టులకు వెళ్లకుండా కేసుల నుంచి తప్పించుకునేందుకు అధికారం కోసం అడ్డదారులు తొక్కుతున్నాడని ప్రజలు దీనిని గుర్తించాలన్నారు. ఏ పని కావాలన్నా ఎమ్మెల్యే అనుమతులు తీసుకోవాల్సి వస్తుందని గతంలో ఎన్నడూ కైకలూరులో ఈ సంస్కృతి లేదన్నారు. ప్రధానంగా బీసీ వర్గాలను టార్గెట్ చేసి దాడులు చేయించడంతో పాటు అక్రమంగా కేసులు పెట్టి చిత్రహింసలు పెడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా బతకాలంటే ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పీజేఎస్ మాల్యాద్రి, పట్టణ అధ్యక్షుడు ఎండీ జానీ, ఎస్సీ సెల్ నాయకుడు తేరా రమేష్‌బాబు, గ్రామ నాయకులు పి. రాధాకృష్ణ, తలారి చిన్నసీతారామయ్య, ఏకుల కృష్ణయ్య బోడావుల నాంచారయ్య, నారగాని మహాలక్ష్మణుడు, నాగనబోయిన నాంచారయ్య, జిజ్జువరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా నాయకుడు లక్ష్మణరావు

గిట్టుబాటు ధర కల్పనలో ప్రభుత్వాలు వైఫల్యం

ముసునూరు, ఫిబ్రవరి 19: రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఏపీ రైతు సంఘం ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు అన్నారు. సోమవారం చెక్కపల్లిలో రైతు, కౌలు రైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థ పాలనతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, కౌలు రైతులకు కౌలు కార్డులను ఇచ్చి, వారికి బ్యాంక్ రుణాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గత ఖరీఫ్, ప్రస్తుత రబీ సీజన్‌లో వర్షాభావంతోపాటు మిచౌంగ్ తుఫాన్ వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయి, అప్పులపాలయ్యారని, తక్షణమే పాలకులు రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘాలను ఏర్పాటు చేసుకుని, రైతులంతా ప్రభుత్వాలపై తమ హక్కుల కోసం పోరాడాలని జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ అన్నారు. అనంతరం కౌలురైతుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు కుచిపూడి నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.



'చంద్రబాబుకు డాక్టర్ సీఎల్వీ క్షమాపణ చెప్పాలి'

ముదినేపల్లి రూరల్, ఫిబ్రవరి 19: చంద్రబాబును విమర్శించిన డాక్టర్ సీఎల్ వెంకట్రావు, మాజీ మంత్రి కామినేని నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పాల్గొనడం ఆశ్చర్యకరంగా ఉందని తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు దావు నాగరాజు విమర్శించారు. సోమవారం ఆయన సింగరాయపాలెంలో టీడీపీ నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడుతూ వెంకట్రావు తక్షణం చంద్రబాబును విమర్శించినందుకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీ నుంచి బయటకు వెళ్ళిపోయిన నాయకులు నేడు ఆత్మీయ సమావేశంలో పాల్గొనటం మానుకోవాలని లేని పక్షంలో కార్యకర్తల నుంచి అవమానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

టీడీపీ-జనసేన కూటమితోనే సుపరిపాలన



మండవల్లి, ఫిబ్రవరి 19: రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమిని గెలిపించి రాష్ట్రంలో సుపరిపాలన అందించాలని జనసేన సమన్వయకర్త బీవీ రావు అన్నారు. సోమవారం భైరవపట్నంలో జరిగిన బీసీ చైతన్య సదస్సులో ఆయన మాట్లాడుతూ బీసీలు రాజకీయంగా అభివృద్ధి చెందాలని టీడీపీ-జనసేన బీసీలకు పెద్దపీట వేశాయన్నారు. బీసీ నాయకులు వీరమల్లు నరసింహారావు, జనసేన గౌరవ అధ్యక్షుడు పోకల కృష్ణ, టీడీపీ యువ నాయకుడు కొడాలి వినోద్, మోరు విజయరాజు, బీసీ నాయకురాలు సీతా అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ కోసం దివ్యాంగురాలి వేడుకోలు



ముదినేపల్లి, ఫిబ్రవరి 19 : పూర్తి అంగవైకల్యంతో నడవలేని స్థితిలో ఉన్న తనకు పింఛన్ ఇప్పించాలని ముదినేపల్లి అంబేడ్కర్ కాలనీకి చెందిన దివ్యాంగురాలు గోన మాధవి అధికారులను వేడుకుంది. స్పందన సందర్భంగా సోమవారం పలువురి సహాయంతో స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన ఆమె తనకు పింఛన్ మంజూరు చేయించేందుకు సహకరించాలని ఎంపీడీవో గంగాధరరావుకు అర్జీ అందజేసింది. మాధవి గత నెల 11న ఏలూరు జిల్లా ఆసుపత్రిలో సదరం సర్టిఫికెట్ కోసం క్యాంప్‌కు వెళ్లిందని, ఇంత వరకు సర్టిఫికెట్ రాలేదని, పెన్షన్‌కు దరఖాస్తు చేసే అవకాశం కలగలేదని బీజేపీ ఓబీసీ విభాగం జిల్లా ఉపాధ్యక్షులు మొవ్వా పణీంద్ర కుమార్ అధికారులకు వివరించారు. ఉన్నతాధికారుల దృష్టికి దివ్యాంగురాలు పరిస్థితిని తీసుకెళ్తామని ఎంపీడీవో తెలిపారు. ఆమె పరిస్థితికి స్పందించిన మండల పరిషత్ కార్యాలయ పరిపాలనా అధికారి రమణ బాబు, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, ఇతర సిబ్బంది రూ.2 వేల ఆర్థిక సాయం మాధవికి అందజేశారు.

పెండ్లి కుమారుడికి బంగారు నాణెం అందజేత

చాట్రాయి, ఫిబ్రవరి 19: కృష్ణామిల్క్ యూనియన్ కల్యాణమస్తు పథకం కింద మండలంలోని కొత్తగూడెం పాల సహకార సంఘం సభ్యుడు ములగలపల్లి మల్లికార్జునరావు కుమారుడు వరప్రసాద్ వివాహం సందర్భంగా సంస్థ డైరక్టర్ బొట్టు రామచంద్రరావు రూ. 20 వేలు విలువైన బంగారు నాణెం అందజేశారు. తిరువూరు మేనేజర్ సాంబశివమూర్తి, సంఘం అధ్యక్షుడు వెల్ది రామారావు పాడి రైతులు పాల్గొన్నారు.



ముసునూరులో పంచముఖాంజనేయుడు..



పోలవరంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాల్లో భక్తులు



ఆగిరిపల్లిలో శోభనాచలుడి కల్యాణం

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

ముసునూరు, ఫిబ్రవరి 19: ముసునూరులో కార్యసిద్ధి పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. వేదాంతం వెంకట అనంతరామాచార్యులు ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆగమ కోవిదులు వేదాంతం వేణుగోపాల కృష్ణమాచార్యుల వేదమంత్రోచ్చారణలతో వందలాదిమంది భక్తుల నడుమ సోమవారం ఉదయం 10.31 గంటలకు విగ్రహ, ధ్వజస్తంభం, ద్వారపాలకులు, ఆలయ శిఖర ప్రతిష్ఠను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారి విశేష అభిషేకాలు చేసి, ప్రత్యేక అలంకరణ చేయగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. పూర్ణాహుతి నిర్వహించి, సీతారాములవారి శాంతి కల్యాణాన్ని జరిపారు. ప్రజాప్రతినిధులు, రాజకీయనాయకులు, అధికారులు, గ్రామ ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ అధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిగింది.

వైభవంగా కోటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

చాట్రాయి, ఫిబ్రవరి 19: మండలంలోని పోలవరంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో కాత్యాయినీ సమేత ఉమా కోటేశ్వరస్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం ఉదయం వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావటంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. బీజేపీ ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి తపన చౌదరి, నియోజకవర్గ టీడీపీ నాయకుడు పర్వతనేని గంగాధర్, జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, అక్కినేని చందు, పార్టీ మండల అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు, చిన్న అప్పారావు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ భారీ అన్న సమారాధన జరిపింది.

ఆగిరిపల్లిలో ముగిసిన కల్యాణోత్సవాలు

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 19: శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహుని మాఘమాస తిరునాళ్ళల్లో కల్యాణాల పర్వం ముగిసింది. సోమవారం ఉదయం శాంతి కల్యాణంలో ఉభయదాతలుగా వలివేటి శ్రీనివాస్, శ్రీధర్ దంపతులు పాల్గొన్నారు. సాయంత్రం నిత్య కల్యాణం అనంతరం చిన్నగరుడ వాహనంలో స్వామివారి గ్రామోత్సవం జరిగింది. ఉభయదాతలుగా యండూరి చంద్రశేఖర్‌రావు, ప్రణీత్, శ్రీనివాసరావు, మిథున్ దంపతులు వ్యవహరించారు. కల్యాణం అనంతరం ప్రధానార్చకులు వేదాంతం శేషబాబు, గునిపూడి రామ అనంతకృష్ణ భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

నేటి నుంచి బాలరావమ్మ ఉత్సవాలు



ఆగిరిపల్లి, ఫిబ్రవరి 19: ఆగిరిపల్లిలో వేంచేసివున్న దుగ్గిరాల బాలరావమ్మ మాఘమాస ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆగిరిపల్లి చిన్న బజారులోని పోతురాజు దిమ్మ వద్ద ఉదయం ఈ ఉత్సవం ప్రారంభమవుతుంది. ప్రతిరోజూ రెండు ఊర్లలో అమ్మవారిని ఊరేగించి ఈ నెల 24న పాల పొంగళ్ళతో ఈ ఉత్సవం ముగుస్తుంది. అమ్మవారిని దర్శించుకోవడానికి దూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు.



పోలవరం విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న టీడీపీ నాయకులు

వైసీపీ అరాచక పాలన

▸▸'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడికి ఖండనలు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 19 : దాడికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలంటూ ఏపీయూడబ్ల్యూజే ఏలూరు జిల్లా శాఖ జర్నలిస్టులు సోమవారం ఉదయం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్పీ జి.స్వరూపరాణికి వినతిపత్రం అందజేశారు. ఇటీవల ఏలూరు జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలుచోట్ల జర్నలిస్టుపై భౌతికదాడులు పెరిగిపోతున్నాయని సమాజ శ్రేయస్సు కోసం నిత్యం శ్రమించే జర్నలిస్టులపై దాడి చేసిన వారిని తక్షణం అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మాణిక్యరావు, రాష్ట్ర కార్యదర్శి రఘురామ్, ఆంధ్రజ్యోతి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కోఆర్డినేటర్ జీవీఎస్ఎన్ రాజు, ఏపీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు సంజయ్‌కుమార్, కార్యదర్శి వాసు, చిన్నపత్రికల అధ్యక్షుడు శాంతికుమార్, చిన్న పత్రికల రాష్ట్ర కార్యదర్శి రామారావు, ఏపీయూ డబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు ఉర్ల శ్రీనివాస్, కిషోర్, జర్నలిస్టులు గంగరాజు, భరత్, ఆంధ్రజ్యోతి ఫోటో గ్రాఫర్ ప్రసాద్, క్రైం రిపోర్టర్ బెనర్జీ పలువురు పాల్గొన్నారు.



కలిదిండి: ప్రజాస్వామ్యానికి మూల స్తంభమైన మీడియాపై దాడి అమానుషమని టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్ ఖండించారు. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ రౌడీ మూకలు దాడి దుర్మార్గమని మండిపడ్డారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక మీడియాపై దాడులు పెరిగాయన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కైకలూరు: సమాజంలో జరిగే మంచి చెడులను ప్రజలకు వివరించే విలేకర్లపై వైసీపీ అల్లరిమూకలు దాడులకు పాల్పడడం దారుణమని టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాధరాజు అన్నారు. సోమవారం కైకలూరులో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై వైసీపీ మూకల దాడిని ఆయన తీవ్ర స్థాయిలో ఖండించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ప్రజల స్వేచ్ఛను హరించివేశారని నిజాలను నిర్భయంగా రాసే విలేకర్లపైన దాడులకు పాల్పడి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ప్రతి విలేకరిని పేరుపేరునా గుర్తించి ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై దాడికి పాల్పడిన వారిని ప్రభుత్వం శిక్షించాలన్నారు.

ముదినేపల్లి: రాప్తాడులో సీఎం జగన్ సిద్ధం సభ కవరేజీకి వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై వైసీపీ మూకలు దాడి చేయడం దారుణమని తెలుగు యువత కైకలూరు నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు తీవ్రంగా ఖండించారు. పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా వైసీపీ నాయకులు ప్రవర్తించటం దురదృష్టకరమన్నారు.

పశ్చిమ గోదావరి

భీమవరం ఫిబ్రవరి 19 : రాప్తాడులో జరిగిన వైసీపీ సిద్ధం బహిరంగ సభలో విధి నిర్వహణలో ఉన్న ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు చేసిన దాడిని ఖండిస్తూ భీమవరం కలెక్టరేట్ వద్ద ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. భీమవరం ఏరియా ప్రెస్‌క్లబ్ సభ్యులు కలెక్టరేట్ స్పందనలో భీమవరం ఆర్డీవో శ్రీనివాసులురాజుకు వినతి పత్రం అందజేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కేవీ ప్రసాద్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్ఫూర్తి ఛత్రపతి శివాజీ

చాట్రాయి, ఫిబ్రవరి 19: మండలంలోని తుమ్మగూడెం ఉర్దూ పాఠశాలలో సోమవారం ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్ర పటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శివాజీ జనరంజక పాలన, శత్రువులతో ఆయన చేసిన వీరోచిత యుద్ధాలపై హెచ్‌ఎం వెంకట్రావు విద్యార్థులకు వివరించి శివాజీని స్ఫూర్తిగా తీసుకొని మంచి పౌరులుగా ఎదగాలని ఉద్బోధించారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన



నూజివీడు, ఫిబ్రవరి 19: రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నూజివీడు మండలంలోని పోలింగ్ స్టేషన్లను ఎంపీడీవో కిరణ్‌కుమార్ సోమవారం పరిశీలించారు. మొర్సపూడి, మీర్జాపురం, మర్రిబంధం, సీతారాంపురం, పల్లెర్లమూడి, ఎంఎస్ పాలెం గ్రామాల్లో గల పోలింగ్ స్టేషన్‌లలో వసతులు పరిశీలించారు.



సిబ్బందిని అభినందిస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ తదితరులు

ట్రిపుల్ ఐటీలో పలువురికి అదనపు బాధ్యతలు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 19: నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో విద్యార్థుల సంక్షేమానికి మెంటార్లకు అదనపు బాధ్యతలిస్తూ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ ఆదేశాలు జారీ చేశారు. నూజివీడు క్యాంపస్‌లో ఫిజిక్స్ విభాగంలో మెంటార్‌గా పనిచేస్తున్న ఎ. బ్రహ్మాస్వాములు బాయిస్ వెల్ఫేర్ డీన్‌గా, ఇంగ్లీష్ మెంటార్ పి.దుర్గాభవానిని గరల్స్ వెల్ఫేర్ డీన్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఏడాది పాటు వీరు బాధ్యతలను నిర్వర్తిస్తారు. ఈ సందర్భంగా నూతనంగా నియమించిన సిబ్బందిని ఆయన అభినందించారు.

ముక్కొల్లుపాడులో పల్లెకు పోదాం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 19: కేంద్ర ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా కృషి చేయాలని బీజేపీ నూజివీడు మండల అధ్యక్షుడు గోగినేని శ్రీనివాస కుమార్ అప్పారావు అన్నారు. నూజివీడు మండలం ముక్కొల్లుపాడు, పోతురెడ్డిపల్లి గ్రామాల్లో పల్లెకుపోదాం కార్యక్రమంలో భాగంగా కేంద్ర పథకాలను ఆయన గ్రామీణులకు వివరించారు. పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు కేంద్రం లక్షన్నర వరకు ఆర్థిక సాయం చేస్తోందన్నారు. అలాగే హెల్త్‌కార్డుల ద్వారా ఆరోగ్యబీమాతో పాటు పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. బీజేపీ నాయకులు అనుమాల నాగేశ్వరరావు, ఎ. ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

'ఐక్య సంగ్రామ భేరి'ని విజయవంతం చేయాలి



ముదినేపల్లి, ఫిబ్రవరి 19 : విజయవాడలో ఈ నెల 22న నిర్వహించే మాలల ఐక్య సంగ్రామ భేరిని విజయవంతం చేయాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు శావా నాగ జగన్ బాబూరావు కోరారు. ముదినేపల్లి దళిత సంఘాల కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సభ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో కదలిక ఉంటుందన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ విషయంలో రాజకీయ పార్టీలు సుప్రీం కోర్టు తీర్పునకు కట్టుబడి ఉండాలని, ఎస్సీ వర్గాల్లో అత్యధిక శాతం జనాభా కలిగిన మాలలకు రాజకీయ పార్టీలు తగిన ప్రాధాన్యం కల్పించాలని ఎస్సీ, ఎస్టీల భూ హక్కుల చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని తదితర డిమాండ్లతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాలమహానాడు నాయకులు అందుగుల ప్రతాప్ కుమార్, చీలి లావణ్య, జక్కుల విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.